ఆంధ్రజ్యోతి
బాపట్ల
మంగళవారం 15 అక్టోబరు 2024

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- వర్షాలపై కలెక్టర్ ఆదేశాలు
- ఉద్యోగుల సెలవులు రద్దు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

బాపట్ల, ఆంధ్రజ్యోతి, అక్టోబరు 14 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీవర్షాల హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటమురళి ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశం అయ్యారు. భారీవర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో కూడా కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 18వ తేది వరకు భారీవర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికలతో మత్స్యకారులను సముద్రంలోకి వేటకి వెళ్ళనివ్వరాదని చెప్పారు. వేటకొరకు సముద్రంలోకి వెళ్ళినవారు తక్షణమే వెనకకు వచ్చేలా మత్స్యశాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సముద్రం స్నానానికి వచ్చే పర్యాటకులను తాత్కాలికంగా నిలిపివేయాలన్నారు. ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను బాపట్ల, చీరాలలో ఉంచాలని డీఆర్వోను ఆదేశించారు. 19వ తేదీ వరకు అధికారులు, ఉద్యోగులు సెలవు పెట్టరాదని ఇప్పటికే సెలవులో ఉన్నవారి సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.ముందస్తు జాగ్రత్త చర్యలతో పునరావాస కేంద్రాలను ఎంపిక చేసుకోవాలన్నారు.

● జిల్లాలోని చెరువులు, కాల్వల గట్లు బలహీనంగా ఉండి గండ్లు పడేప్రాంతాలను జలవనరుల శాఖాధికారులు గుర్తించాలన్నారు. సమస్య పరిష్కారానికి తాత్కాలికంగా లేదా శాశ్వత మరమ్మతు పనులపై అంచనాలు రూపొందించి నివేదిక ఇవ్వాలన్నారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాలు నీటమునిగితే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చూడాలన్నారు. నిత్యావసర సరకులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలితే తక్షణమే తొలగించి పునరుద్ధరించటానికి యంత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఎక్స్కవేటర్లు, జనరేటర్లు వంటివి ఏర్పాటుచేసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, జిల్లా అధికారులు, ఆర్డీవోలు, ఉపకలెక్టర్ లక్ష్మీకుమారి, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

సింగిల్స్‌కూ లక్

- ఫలించిన సిండికేట్ మంత్రం
- నలుగురైదుగురు జట్టు కట్టి పదుల సంఖ్యలో దరఖాస్తు చేసినా నిరాశే
- రెండుమూడు దరఖాస్తులతోనే వరించిన అదృష్టలక్ష్మి
- ఆరు షాపులు దక్కించుకున్న మహిళలు
- రేపటి నుంచి మద్యం షాపులు ప్రారంభం

బాపట్ల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): నలుగురైదుగురు కలిసి పదుల సంఖ్యలో దరఖాస్తు చేశారు.....అయినా తప్పని నిరాశ....ఒక్కటే దరఖాస్తుతో వరించిన లక్.. సిండికేట్ మంత్రం ఫలించి షాపుల వశం.. బంధువులయ్యే నలుగురికి ఆరుషాపుల కైవశం....చెల్లి సెంటిమెంట్‌తో విజయాన్ని అందుకున్న అన్నయ్య.. ఆరు దరఖాస్తులతోనే రెండుషాపులు దక్కించుకున్న ఒకే మహిళ.. 20 దరఖాస్తులను ఐదు షాపులకువేస్తే ఒక్కదానితో సరిపుచ్చుకోవాల్సిన పరిస్థితి.. 30 దరఖాస్తులను నలుగురు కలిసివేస్తే కనీసం ఒక్కటీ దక్కని వైనం.. మొత్తంగా చూస్తే నలుగురైదుగురు కూటమి కట్టి ఎక్కువ షాపులు దక్కించుకోవాలని చూసినవారికి లక్ మొహం చాటేయగా, సింగిల్ దరఖాస్తుతో పాటు, ధైర్యం చేసి ఒక్క షాపుకు ఒక్కరే రెండు లేదా మూడు దరఖాస్తులు వేసినవారినే లక్ ఎక్కువగా పలకరించింది. రేపల్లె నియోజకవర్గంలో సిండికేట్ మంత్రం ఫలించి ఆశించిన స్థాయిలో షాపులు.. దీంతో మద్యంషాపుల లాటరీ కొంతమందికి ఖేదాన్ని మిగిలిస్తే, సింగిల్స్‌కు మోదాన్ని మిగిల్చింది. పెద్దసంఖ్యలో దరఖాస్తు చేయడంవల్ల తమను దాటి లాటరీ వేరేవాళ్లను వరించదన్న ధీమాతో ఉన్నవాళ్ల చేతిలో డబ్బు పోయెనే అని మదనపడుతున్నారు



లాటరీలో భాగంగా టోకెన్ నంబరును తీస్తున్న కలెక్టర్ వెంకటమురళి

117 షాపులకు లాటరీ....

జోరు వర్షం కురుస్తున్నప్పటికీ సోమవారం ఉదయం 8 గంటలకే దరఖాస్తుదారులంతా బాపట్లలోని ఎమ్మెస్సార్ కల్యాణమండపానికి చేరుకున్నారు. రెండుకౌంటర్లలో లాటరీ ప్రక్రియ ప్రారంభించగా కలెక్టర్ వెంకటమురళి, జేసీ ప్రఖర్‌జైన్ సారథ్యంలో లాటరీ ద్వారా విజేతలను ఎంపిక చేశారు.మధ్యాహ్నానికే 117 షాపుల లాటరీ పూర్తి కాగా, వెంటనే లైసెన్సు ఫీజులో తొలివాయిదా కట్టించుకోవడంలో ఎక్సైజ్‌శాఖ నిమగ్నమైంది. ప్రతి షాపుకు రెండు రిజర్వ్ పేర్లను తీసినప్పటికీ వాటి అవసరం ఎక్కడా రాలేదని అధికారులు తెలిపారు

ఆరు షాపులను దక్కించుకున్న మహిళలు...

117 షాపులకు దరఖాస్తు చేసే విషయంలో మహిళలు కూడా పెద్దసంఖ్యలోనే పోటీపడగా జిల్లావ్యాప్తంగా ఆరుషాపులను మహిళలు దక్కించుకున్నారు. నిజాంపట్నంకు చెందిన మోపిదేవి చంద్రకళ షాపు నెం.48, 49 రెండు షాపులను ఆరు దరఖాస్తులతోనే దక్కించుకున్నారు. అలాగే సీఏ ఫైనలియర్ విద్యార్థిని కొప్పాక తులసి సంతమాగులూరు మండలంలోని షాపు నెం.95ను సింగిల్ దరఖాస్తుతోనే కైవసం చేసుకున్నారు. చెల్లి పేరుతో వేస్తే కలిసి వస్తుందని ఆమె అన్నయ్య దరఖాస్తు చేయడం, ఆమెనే విజయలక్ష్మి వరించడం సెంటిమెంట్ ఫలించినట్లైంది. బాపట్ల మున్సిపాలిటీ పరిధిలో షాపు నెం.5ను ఇమ్మడి అరుణ దక్కించుకోగా, కర్లపాలెం మండలంలోని 33వ షాపును లావు సునీత కైవసం చేసుకున్నారు. చీరాల మున్సిపాలిటీ పరిధిలోని ఓ షాపును ఇగుటూరి శివకుమారి వశం చేసుకున్నారు

30 దరఖాస్తులు వేస్తే నిల్....కానీ ఒక్కరికే రెండు షాపులు....

బాపట్ల నియోజకవర్గ పరిధిలోని రియల్టర్లు నలుగురు కలిసి 30 దరఖాస్తులను ఐదు షాపులకు వేయగా ఒక్క షాపుకూడా లాటరీలో రాలేదు. మరోచోట నలుగురైదుగురు కలిసి 21 షాపులకు దరఖాస్తు చేస్తే ఒక్కషాపుతో సరిపెట్టుకోవాల్సివచ్చింది. పెద్దసంఖ్యలో దరఖాస్తు చేసినవారి పరిస్థితి ఇలాఉంటే పరిమిత సంఖ్యలో దరఖాస్తు చేసి ఒక్కరే రెండుషాపులు దక్కించుకున్నవారూ ఉన్నారు. బాపట్ల రూరల్ పరిధిలోని గోకరాజు రామకృష్ణంరాజు బాపట్లటౌన్‌లో 3, కర్లపాలెం మండలంలో 34 షాపు దక్కించుకున్నారు. అలాగే గోకరాజు శ్రీధర్ రెండు షాపులు కైవసం చేసుకోగా వీరి బంధువులైన మరో ఇద్దరు చెరోషాపును దక్కించుకోవడంతో మొత్తం ఆరు షాపులు ఒకే కుటుంబంలోని బంధువులు దక్కించుకున్నారు. అదేవిధంగా కొరిశపాడుకు చెందిన బి.సుబ్బారావు రెండుషాపులను కైవసం చేసుకున్నారు

రేపల్లె నియోజకవర్గంలో ఫలించిన ఒత్తిళ్లు...

జిల్లాలో రేపల్లె నియోజకవర్గ పరిధిలో మద్యం షాపులకోసం పెద్దఎత్తున సిండికేట్ నడిచిందనే ఆరోపణలు వచ్చాయి. లాటరీలోనూ అందుకు తగ్గట్లుగానే ఫలితాలు రావడం చర్చకు దారితీసింది. రేపల్లెతో పాటు చెరుకుపల్లి మండల పరిధిలో ఒక్కొక్కరు రెండు షాపులు దక్కించుకోవడంతోపాటు అక్కడ పడిన పరిమిత సంఖ్యలో దరఖాస్తులన్నీ వీరివేనన్న చర్చ నడుస్తోంది. దీంతో ఇక్కడ ఒత్తిళ్లు ఫలించి తమ అనుకూలురుకు షాపులు దక్కించుకోవడంలో కొంతమేర సఫలీకృతం అయ్యారనే చర్చ నడుస్తోంది

రేపటి నుంచి షాపులు ప్రారంభం....

లాటరీలో షాపులు దక్కించుకున్న వారంతా లైసెన్సు ఫీజు కట్టడానికి 24 గంటల వ్యవధిని ఎక్సైజ్‌శాఖ ఇచ్చింది. ఆ మొత్తాలను చాలావరకు సోమవారం సాయంత్రానికే చెల్లించి ప్రొవిజనల్ లైసెన్సును లాటరీలో విజేతలుగా నిలిచినవారు పొందారు. వీటికి స్టాక్ విషయంలో మంగళవారం ఇండెంట్ పెట్టి బుధవారం షాపులను ప్రారంభించుకోవచ్చని అధికారులు తెలిపారు

షాపుల లొకేషన్ నోటిఫైపై తకరారు....

లాటరీలో షాపు దక్కించుకున్నవారు దానిని ఏర్పాటుచేసుకునే లొకేషన్ విషయంలో కొంతసమయం ఇవ్వాలని ఎక్సైజ్‌శాఖ నిర్ణయించింది. వెంటనే స్టాక్ తెచ్చుకుని అమ్మకాలు తాత్కాలికంగా జరుపుకోవచ్చని తెలిపింది. మరోవైపు లాటరీలో షాపులు దక్కించుకున్నవారు సోమవారం నుంచే రద్దీ లొకేషన్‌ల వేట ప్రారంభించారు. నేటి ఫికేషన్‌లో షాపు లొకేషన్ నోటిఫై చేయకపోవడంతో వీటి విషయంలో తకరారు నడిచే సూచనలు కనిపిస్తు న్నాయి. ఇప్పటికే బాపట్ల పట్టణంలో ఓ షాపు లొకేట్ విషయంలో ఇద్దరు పోటీపడుతున్నట్లు తెలుస్తోంది. రెండుమూడు రోజుల్లో వీటిపై స్పష్టత వచ్చే అవకాశాలు కనబడుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

పిడుగురాళ్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పనగర్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అయ్యప్పనగర్ సమీపంలో ఆటో యుటర్న్ చేసుకుంటుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న కందుకూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టడంతో ఆటోడ్రైవర్ మలబంటి లక్ష్మయ్య (45) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనలో ఆటో పూర్తిగా ధ్వంసమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్ తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్తూ కానరాని లోకాలకు


తురకా అంకమ్మ (ఫైల్‌ఫొటో)

దాచేపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గత పది రోజులుగా దేవీశరన్నవరాత్రుల్లో ప్రత్యేక పూజలు, కోలాటాలు, భక్తిగీతాలతో గడిపారు. ఈ పది రోజుల పాటు మాలధారణ దీక్ష ధరించి శనివారం రాత్రి బతుకమ్మను దాచేపల్లిలోని నాగులేరులో నిమజ్జనం చేసి మాలధారణ దీక్షతోనే విజయవాడ అమ్మవారిని దర్శించుకునేందుకు తన కొడుకుతో కలిసి బయలుదేరారు. మంగళగిరి సమీపంలోని కాజా టోల్‌ప్లాజా వద్ద కారు పల్టీకొట్టి డివైడర్‌ను ఢీకొట్టింది. డ్రైవర్ నిద్రమత్తులో చేసిన ప్రమాదంలో మాలధారణ దీక్షలో ఉన్న తురకా అంకమ్మ (43) బలమైన గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆమెతో పాటు కారులో ప్రయాణిస్తున్న ఆమె కొడుకు జగదీష్ కొద్దిపాటి గాయాలతో బయటపడ్డారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అనధికార పురుగు మందులు సీజ్

సత్తెనపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వడ్డవల్లి ఆంజనేయ స్వామి గుడి ప్రాంతంలో ఒక గోడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.5,85,240 విలువైన పురుగు మందులను ఇన్‌చార్జ్ ఏడీఏ శ్రీధర్‌రెడ్డి, వీఆర్‌వో అనిల్ ఆధ్వర్యంలో సోమవారం సీజ్ చేశారు. అధికారులకు అందిన సమాచారం మేరకు గోడౌన్‌లో తనిఖీలు నిర్వహించారు. గోడౌన్ అద్దెకు ఇచ్చిన ఓనరు శివ శంకర ఫెర్టిలైజర్ షాపు నిర్వాహకులు అద్దెకు తీసుకున్నారని తెలియజేశారు. ఈ తనిఖీల్లో బీఏఎస్‌ఎఫ్ కంపెనీకి సంబంధించిన రూ.61,550 విలువైన పురుగు మందులు, బెస్ట్ అగ్రో లైఫ్ లిమిటెడ్ కంపెనీకి చెందిన రూ.1,10,300 విలువైన పురుగు మందులు, పీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీకి చెందిన రూ.4,13,440 విలువైన పురుగు మందులు, మొత్తం 5,85,240 విలువైన పురుగు మందులను సీజ్ చేసినట్టు శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

యూసీలు ఇస్తేనే.. నిధులు!

- స్కూల్ గ్రాంట్‌కు కేంద్రం మోకాలడ్డు
- యుటిలైజేషన్ సర్టిఫికెట్స్ ఇవ్వాలని మెలిక
- వైసీపీ హయాంలో దారి మళ్లిన కేంద్రం నిధులు
- పాఠశాలలు ప్రారంభమై ఐదు నెలలైనా పైసా రాని వైనం


గుంటూరులోని మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్

గుంటూరు(విద్య), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో సంస్కరణల పేరుతో గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలకు నేడు విద్యార్థులు, హెచ్‌ఎంలు మూల్యం చెల్లించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కేంద్రం విడుదల చేసిన స్కూల్ గ్రాంట్ నిధులు ఇష్టారాజ్యంగా పక్కదారి మళ్లించి పాఠశాలల నిర్వహణను గాలికి వదిలేసిన గత ప్రభుత్వ పాపాలు ఇప్పుడు శాపాలుగా మారుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు గడుస్తున్నా పాఠశాలల నిర్వహణకు పైసా నిధులు విడుదల కాలేదు. పాఠశాలల్లో రోజువారీ ఖర్చుల కోసం నిధులు లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులు జీతాల్లోంచి వెచ్చించాల్సిన దుస్థితి నెలకొంది. ఇది ఎన్‌డీఏ ప్రభుత్వానికి సంకటంగా మారింది.

హెచ్‌ఎంల ఆందోళన

ఉమ్మడి జిల్లాలో 345పైగా ఉన్నత పాఠశాలలు, మరో 4,233 వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో దాదాపు 5.50 లక్షల మందికిపైగా విద్యార్థులు 1 నుంచి 10వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు. ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో స్కూల్ గ్రాంట్స్ విడుదల చేస్తారు. కేంద్రం నుంచి ఏటా జూలై మొదటి వారంలోనే నిధులు వస్తాయి. వాటికి రాష్ట్ర ప్రభుత్వం కొంత మొత్తం (మ్యాచింగ్ గ్రాంట్) నిధులు జోడించి స్కూల్‌గ్రాంట్‌గా విడుదల చేస్తారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన నిధులు వచ్చినట్లు దారి మళ్లించింది. ఈ నిధులు ఎలా వినియోగించారో చెప్పాలని ఇందుకు యూసీలు (యుటిలైజేషన్ సర్టిఫికెట్స్) సమర్పించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయడంతో హెచ్‌ఎంలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు విడుదల, వినియోగం ఇలా...

ప్రభుత్వం స్కూల్ గ్రాంట్ కింద విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు విడుద చేస్తారు. విద్యార్థుల సంఖ్య 1 నుంచి 20లోపు ఉంటే రూ. 10వేలు, 21 నుంచి 50లోపు రూ. 15వేలు, 50 నుంచి 100లోపు ఉంటే రూ. 20వేలు, 101 నుంచి 250లోపు ఉంటే రూ. 50వేలు, 251- నుంచి 1000లోపు ఉంటే రూ.75వేలు, 1000పైగా విద్యార్థులుంటే లక్ష గ్రాంట్స్ విడుదల చేస్తారు. ఈ నిధులతో పాఠశాలలో ఎలక్ట్రికల్ బిల్లు, చాక్‌పీసులు, స్టేషనరీ, మంచినీరు, కంప్యూటర్స్ నిర్వహణ, మోటార్ ఖర్చులు, మరుగుదొడ్ల నిర్వహణ, చిన్న చిన్న ఫంక్షన్ల కోసం వినియోగిస్తారు. అయితే నిధుల లేకపోవడంతో హెచ్‌ఎంలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

యుటిలైజేషన్ సర్టిఫికెట్స్ ఎవరు ఇస్తారు..

ప్రభుత్వం నుంచి విడుదల అయ్యే నిధులకు సంవత్సరం చివరలో ప్రతిశాఖ యూసీలు (యుటిలైజేషన్ సర్టిఫికెట్స్) ఇవ్వడం సర్వసాధారణం. అయితే గత ప్రభుత్వం కేంద్రం నుంచి తీసుకున్న నిధులు ఎలా ఖర్చు చేశారో జిల్లా స్థాయిలో అధికారులకు కూడా తెలియని దుస్థితి. ఇప్పుడు యూసీలు ఎక్కడ నుంచి తీసుకురావాలి, ఎవరు ఇస్తారు అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. గతంలో కేంద్రం మంజూరు చేసిన నిధులకు యూసీలు ఇవ్వని కారణంగానే ఇప్పటి వరకు స్కూల్ గ్రాంట్ మంజూరు కాలేదని హెచ్‌ఎంలు చెబుతున్నారు. ఈ సమస్యను అధిగమించి సత్వరం నిధులు ఇవ్వకుంటే పాఠశాల నిర్వహణ మరింత భారం అయ్యే పరిస్థితి నెలకొంది.

భారం.. భరించలేం!

- యాప్‌ల నిర్వహణతో అంగన్‌వాడీలు లబోదిబో
- నాలుగు యాప్‌లు సహా 15 రికార్డుల నిర్వహణ
- మావల్ల కాదంటూ ఆందోళన దిశగా అడుగులు

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ ఉద్యోగులకు పనిభారం పెరుగుతూనే ఉంది. చాలీచాలని వేతనాలతో ఉద్యోగాలు చేసే వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోయలేని భారం వేస్తున్నాయి. రెండు ప్రభుత్వాల విధుల భారం మోయలేక మహిళా ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. తమపై భారం తగ్గించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. స్త్రీ, శిశు సంక్షేమంలో అంగన్‌వాడీలు పాత్ర అత్యంత కీలకం. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 3 లక్షల మంది గర్భిణులు, బాలింతలు, లక్షన్నర మంది చిన్నారులకు పోషణ అందించడంతోపాటు, వారి సంక్షేమం విషయంలో అంగన్‌వాడీ ఉద్యోగులు ప్రముఖ పాత్ర వహిస్తున్నారు. మూడు జిల్లాల్లో 5 వేల అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. అయితే అంగన్‌వాడీల్లో స్త్రీ, శిశు సంక్షేమానికి సంబంధించిన విధులు ప్రభుత్వ విధానాల కారణంగా దెబ్బతింటున్నాయి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు బలవర్ధక ఆహారాన్ని అందించడంతోపాటు, చిన్నారులకు ప్రీ స్కూలు విద్యను కూడా వీరు అందించాల్సి ఉంటుంది.

విధిగా ఆన్‌లైన్..

అంగన్‌వాడీ కార్యకర్తలు విధిగా నాలుగు ఆన్‌లైన్ యాప్‌లను నిర్వహించాలి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన పోషణ ట్రాకర్లో ప్రతి రోజూ చిన్నారులు, గర్భిణులు, బాలింతల పోషణ వివరాలు నమోదు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన బాల సంజీవని యాప్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందించే పోషణ వివరాలు నమోదు చేయాలి. వీటితోపాటు రెండు యాప్‌లలో ప్రతి రోజూ టాయిలెట్ ఫొటో తీసి అప్లోడ్ చేయాలి. ప్రీస్కూలు నిర్వహించి ఆ ఫొటోలు అప్లోడ్ చేయాలి. వీటితోపాటు నెలకు రెండుసార్లు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఫేషియల్ రికగ్నిషన్ హాజరు నమోదు చేయాలి. నెలకు ఒకసారి మిల్క్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలి.

రికార్డుల మోత

ఒక్కో అంగన్‌వాడీ ఉద్యోగి 15 రికార్డులు నమోదు చేయాలి. ఫుడ్ కంజంప్షన్ రికార్డు(ఎఫ్‌సీఆర్), పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే అనుబంధ పోషణ రికార్డు (ఎస్‌ఎన్‌పీ), ప్రీస్కూల్ అటెండెన్స్ రికార్డు, గర్భిణులు, బాలింతల రికార్డులు ప్రతి రోజూ నమోదు చేయాలి. వీటితోపాటు టీకా రికార్డు, విటమిన్ ఏ రికార్డు, రిఫరల్ సర్వీసెస్, గృహ సందర్శనలు రికార్డు చేయాలి. మంత్లీ ప్రాజెక్టు రిపోర్టు(ఎంపీఆర్), అంగన్‌వాడీ పరిధిలోని హౌస్‌హోల్డ్ సర్వే, గ్రోత్ రికార్డు, గ్రోత్ చార్టు నిర్వహణతోపాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన రెండు టేక్ హోమ్ రేషన్(టీహెచ్‌ఆర్)ల సంతకాల రిజిస్టర్, స్టాఫ్ అటెండెన్స్ రిజిస్టర్ సహా 15 రికార్డులను మోయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ ఉద్యోగులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

విజిలెన్స్‌లో బదిలీల కుదుపు

- ఒకే రోజు ఐదుగురు అధికారులను మార్చిన డీజీపీ

గుంటూరు సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ కార్యాలయంలో భారీ ఎత్తున బదిలీలు జరిగాయి. సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న అధికారులకు స్థాన చలనం కలిగింది. ఒకే రోజు ఐదుగురు కీలక అధికారులను మాతృశాఖకు పంపిస్తూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేయడం కలకలం రేపింది. సోమవారం సాయంత్రం వెలువడిన ఉత్తర్వులు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. డీఈఈ కె. విజయ వీరకుమార్, సీఐ శీలం శ్రీనివాస రెడ్డి, వ్యవసాయాధికారి ఖడ్గం రమణకుమార్, ఎస్ఐ రామచంద్రయ్య, సీనియర్ అసిస్టెంట్ కె.మల్లికార్జున రెడ్డిని విజిలెన్స్ నుంచి బదిలీ చేశారు. వెంటనే మాతృ శాఖకు వెళ్లి పోవాలని ఆదేశాలు జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు ప్రస్తుతం చాలా కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇక్కడి ప్రాంతీయ కార్యాలయం పరిధిలో పలు కీలకమైన కేసులను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ జరుపుతుంది. అధికారుల బదిలీ వ్యవహారం ముందే ఊహించినదే అయినప్పటికీ అతి తక్కువ సమయంలోనే అందరూ వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది.

అందరూ కొత్త వారే..

ప్రభుత్వం మారిన తర్వాత విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఊహించని రీతిలో బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సూర్య శ్రావణ్ కుమార్‌ను ఎస్పీగా నియమించారు. ఆ తర్వాత సీఐ శ్రీహరిని నెల్లూరుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో సీఐ కొమ్మలపాటి చంద్రశేఖర్‌ను నియమించారు. తాజాగా బదిలీ అయిన ఎస్ శ్రీనివాసరెడ్డి స్థానంలో పి.శివాజీని నియమించారు. అగ్రికల్చర్ ఆఫీసర్‌ని కూడా రేపో మాపో నియమిస్తారని తెలిసింది. ఏవో పోస్టు కోసం కొందరు కీలక ఎమ్మెల్యేలు సిఫార్సు చేసినట్టు తెలిసింది. విజిలెన్స్ కార్యాలయంలో ఇప్పటికే చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిల్లోకి వచ్చేందుకు చాలా మంది తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అత్యంత కీలకమైన డీఈఈ పోస్టులో ఒక అధికారిని నియమించేందుకు సీనియర్ ఎమ్మెల్యే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది.

గ్రేడ్-5 కార్యదర్శుల జీతాల సమస్యకు పరిష్కారం

- ఆంధ్రజ్యోతి కథనంతో అధికారుల్లో స్పందన
- కేడర్ స్ట్రెన్త్ సమస్యతో ఉద్యోగులకు కష్టాలు
- ఐదారు నెలలుగా జీతాలు రాక అగచాట్లు

గుంటూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఐదారు నెలలుగా జీతాలు రాక అగచాట్లు పడుతున్న గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల గోడు ఎట్టకేలకు ప్రభుత్వానికి వినిపించింది. ఐదారు నెలలుగా ఉద్యోగులు ఆందోళన చేస్తున్నా అధికారుల దృష్టికి చేరకపోవడంతో వారు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'జీతాల పంచాయతీ' పేరుతో కథనం వెలువడింది. దీంతో సమస్య ప్రభుత్వ పెద్దల దృష్టికి వెళ్లింది. జిల్లా పంచాయతీ అధికారులు, సీఈవోల నిర్వాకంతోనే గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు ఐదారు నెలలుగా జీతాలు అందడం లేదని పంచాయతీరాజ్ కమిషనరేట్ గుర్తించింది. తక్షణమే చర్యలకు ఉపక్రమించింది.

సమస్య పరిష్కారానికి చర్యలు

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అమలులోకి తెచ్చిన 'ఒక పంచాయతీ-ఒక కార్యదర్శి' విధానం కారణంగా గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శులకు కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎంపీడీవో లాగిన్లోని క్యాడర్ స్ట్రెన్త్ సమస్య కారణంగా ఐదారు నెలలుగా ఉద్యోగులకు జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. క్యాడర్ స్ట్రెన్త్‌ను తప్పుగా నమోదు చేసిన ఎంపీడీవోలు, సరిచేయాల్సిన జిల్లా పంచాయతీ అధికారులు వాటిని పట్టించుకోకపోవడంతో ఉద్యోగుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. క్షేత్రస్థాయిలోని ఈ సమస్య ఎంపీడీవోలు, డీపీవోలు అడ్డుపడడంతో ప్రభుత్వం దృష్టికి వెళ్లలేదు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం ప్రభుత్వ పెద్దల దృష్టిలో పడడంతో పంచాయతీరాజ్ కమిషనరేట్ ఈ అంశంపై ఆరా తీసింది. ఉద్యోగుల క్యాడర్ స్ట్రెన్త్ వివరాలతో రాష్ట్ర ఖజానా కార్యాలయంలో అప్‌డేట్ చేయించాలని డీపీవోలు, సీఈవోలకు పంచాయతీరాజ్ కమిషనర్ ఆదివారం షెడ్యూల్ విడుదల చేశారు. పూర్తి స్థాయిలో వివరాలు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

నామినేటెడ్ పదవిని విశ్వబ్రాహ్మణులకు కేటాయించేలా చట్టం చేయాలి


మాట్లాడుతున్న పావులూరి హనుమంతురావు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి హిందూ దేవాలయాల్లో ఒక నామినేటెడ్ పదవిని విశ్వబ్రాహ్మణులకు కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం అరండల్‌పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం జరగనున్న రాష్ట్ర ప్రభుత్వ క్యాబినెట్ సమావేశంలో రాష్ట్రంలో ప్రతి దేవాలయంలో బ్రాహ్మణులకు రెండు నామినేటెడ్ పోస్టులు కేటాయించేలా చట్టం చేయాలని మంత్రి వర్గం తీర్మానం చేస్తున్న నేపథ్యంలో విశ్వబ్రాహ్మణులకు తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. దేవాలయ నిర్మాణ కర్త స్థాపతి, దేవాలయ నిర్మాణంలో భాగస్వాములైన విశ్వబ్రాహ్మణులను విస్మరించడం తగదని అన్నారు. విశ్వబ్రాహ్మణులను విస్మరించిన కారణంగా జగన్ ప్రభుత్వం ఓడిందని అన్నారు. నూతన కూటమి ప్రభుత్వం విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘ సభ్యులు అంగలకుదురు సుశీల, కొలగాని నంద వీర ప్రసాదు, కిరణ్, బ్రహ్మముడి కోటేశ్వరరావు, అత్తలూరు వీర బ్రహ్మాచార్యులు, కదిరి ఈశ్వర చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 32,625 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 38,031 క్యూసెక్కుల వరద నీరు సోమవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 45 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 32,625 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 5,406 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. వాతావరణ శాఖ అధికారులు అందించిన వివరాల మేరకు రానున్న మూడు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని సూచించారు. పొంగే వాగులు, కాల్వలు, రోడ్లులు, కల్వర్టులు, మ్యాన్‌హోల్స్‌కు ప్రజలు దూరంగా ఉండాలని చెప్పారు. భారీ వర్షాల సమయంలో పిడుగులు పడే అవకాశం ఉన్నందున చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ వద్ద ఉండరాదని, ప్రజలు జాగ్రత్త వహించాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి విపత్కర పరిస్థితులైన ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.

గ్రామ పంచాయతీలకు మహర్దశ


డాక్టర్ జాస్తి వీరాంజనేయులు

గుంటూరు సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో ని గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలకు మహర్దశ పట్టిందని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు తెలిపారు. సోమవారం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం 2024 -25 తొలి విడత కేంద్ర నిధులు రూ.988 కోట్లు విడుదలయ్యాయని, అవి త్వరలో రాష్ట్రంలో ని గ్రామ పంచాయతీలు, జిల్లా పరిషత్‌ల ఖాతాలలో జమ అవుతాయని తెలిపారు. అక్టోబరు 14 నుంచి 21 వరకు ప్రభుత్వం పల్లె పండగ పేరుతో వారం రోజుల పాటు కార్యక్రమాలు చేపట్టనుందని తెలిపారు. ఆగస్టు నెలలో రాష్ట్ర వ్యాప్తంగా 13,326 పంచాయతీలలో గ్రామ సభలు పెట్టి గ్రామాభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన పనులపై తీర్మానాలు చేశారని, ఆ పనులు ఇప్పుడు చేపడతారని తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వలన కునారిల్లిన గ్రామ పంచాయతీలు ఇప్పుడు నూతన శోభను సంతరించుకుంటాయని అన్నారు.

అండర్-25 క్రికెట్ జట్టులో రాహుల్‌కు స్థానం


పవన్ సాయి రాహుల్

మంగళగిరి సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-25 పురుషుల జట్టులో పాతమంగళగిరి జీఆర్ స్కూల్ ప్రాంతానికి చెందిన కడియం పవన్ సాయి రాహుల్ ఎంపికయ్యాడు. ఏసీఏ కార్యదర్శి సానా సతీష్‌బాబు సోమవారం ఎంపికైన జట్టు వివరాలను ప్రకటించారు. బెంగళూరు వేదికగా ఈ నెల 17వ తేదీ నుంచి పి.రామచంద్రరావు ట్రోఫీ అండర్-25 మల్టీడే మ్యాచ్‌లు ఆరంభం కానున్నాయి. మంగళగిరి నుంచి ఏసీఏ జట్టుకు ఎంపికైన తొలి క్రికెటర్ రాహుల్ కావడం విశేషం. అండర్-25 జట్టుకు ఎంపికైన రాహుల్‌ను పలువురు ప్రముఖులు అభినందించారు.

అరుణాచలంకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షణకు భక్తుల కోసం ఆర్టీసీ స్పెషల్ హైటెక్ 2+2 పుష్ బ్యాక్ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 15న రాత్రి 9.45 గంటలకు బయల్దేరి 16వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్‌టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడే బస చేసి 17న పౌర్ణమి రోజున అరుణాచలంకు చేరుకుంటుందన్నారు. అదే రోజు సాయంత్రం బయల్దేరి 18వ తేదీన ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96164 సర్వీసుకు ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కోచార్జి రూ.2420 మాత్రమేనని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382825420 సంప్రదించాలని కోరారు.

గుంటూరు-1 డిపో నుంచి ఒక సర్వీసు..

ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 15న రాత్రి 9.45 గంటలకు బయల్దేరి 16వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్‌టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడే బస చేసి 17న పౌర్ణమి రోజున అరుణాచలంకు చేరుకుంటుందన్నారు. అదే రోజు సాయంత్రం బయల్దేరి 18వ తేదీన ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96779 సర్వీసుకు ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు డిపో మేనేజర్ రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఐసీఐసీఐ బ్యాంకులో సీఐడీ తనిఖీలు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట బ్యాంక్ వీధిలో ఉన్న ఐసీఐసీఐ బ్యాంకులో సోమవారం గుంటూరు జిల్లా సీఐడీ అదనపు ఎస్పీ సీహెచ్ ఆదినారాయణ ఆధ్వర్యంలో సీఐడీ బృందం తనిఖీలు నిర్వహించింది. బాధితుల వద్ద నుంచి వాంగ్మూలాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసరావుపేటలో ప్రస్తుతానికి ఏడుగురు బాధితులు ఉన్నట్లు తేలిందన్నారు. వీరి సంఖ్య ఇంకా పెరగవచ్చు అన్నారు. ఇప్పటి వరకు నరసరావుపేట, చిలకలూరిపేట, విజయవాడలో మొత్తం 72 మంది బ్యాంకు బాధితులు ఉన్నారని ఆయన చెప్పారు. నరసరావుపేటలో 7, చిలకలూరిపేటలో 60, విజయవాడలో 5 మంది బాధితులు ఉన్నారని చెప్పారు. బాధితులకు మొత్తం రూ. 28 కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్లు గమనించామన్నారు. నరసరావుపేటలో ఐదుగురు బాధితుల వాంగ్మూలాలను నమోదు చేసినట్లు చెప్పారు. బాధితులు ఇంకా ఎవరైనా ఉంటే గుంటూరు జిల్లా సీఐడీ కార్యాలయంలో సంప్రదించి వివరాలు తెలియజేయవచ్చునారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 31,040 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 36,868 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. దీనిలో పవర్ జనరేషన్ ద్వారా 16వేల క్యూసెక్కుల నీరు కృష్ణా నదికి వస్తున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

21,793 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 24,413 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 21,793 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 20,808 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8500	16000	334	8500	15200
నెంబరు. 5	10000	15500	నెంబరు. 5	12000	16500
273	–	--	273	12000	12500
341	9000	14500	341	9500	13500
4884	12500	15000	4884	10000	14000
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9000	18600	తేజ	11000	18600
బ్యాడిగి	9000	15500	బ్యాడిగి	10000	14200
దేవనూరు డీలక్స్	9500	16000	దేవనూరు డీలక్స్	10500	15500
తెల్లకాయలు	5000	11500	తెల్లకాయలు	5000	11000

లోతట్టుప్రాంతాల్లో కమిషనర్ పరిశీలన



రాజీవ్‌గాంధీకాలనీలో పరిశీలిస్తున్న కమిషనర్

బాపట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల నేపథ్యంలో లోతట్టుప్రాంతాల్లో నిలిచిన వర్షపునీటిని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి సోమవారం సిబ్బందితో కలిసి పరిశీలించారు. శారదాపురి కాలనీ, వెన్నెలకంటి నగర్, రాజీవ్‌గాంధీకాలనీ, ఇందిరానగర్ పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఎక్కడ నీరు నిల్వలేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులకు ఆయన సూచించారు. నీరు నిల్వ ఉన్నచోట వ్యాధులు వ్యాపించకుండా తగుచర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు పెరిగితే లోతట్టు ప్రాంతాల వారికి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ ఉమామహేశ్వరరావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం విషయంలో అలసత్వం తగదు : కమిషనర్

బాపట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం విషయంలో అలసత్వం తగదని కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయం నందు సోమవారం పారిశుధ్యవిభాగ సిబ్బంది హాజరును కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. డ్రైనేజిలలో సిల్ట్ తొలగింపు ప్రతిరోజు చేపట్టాలన్నారు. తడి, పొడి చెత్త, హానికర వ్యర్థాలను తప్పనిసరిగా వేరు చేయాలన్నారు. దోమల నివారణకు వార్డులలో ప్రతిరోజు ఫాగింగ్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రధాన రోడ్లపైన నీరు నిల్వలేకుండా చూడాలన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

శ్మశాన భూముల్లేని ఎస్సీ, ఎస్టీ కాలనీలను గుర్తించాలి

● కలెక్టర్ జే వెంకటమురళి



కలెక్టర్ జె.వెంకటమురళికి సమస్య వివరిస్తున్న బాధితులు

బాపట్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): శ్మశాన భూములు లేని ఎస్సీ, ఎస్టీ కాలనీలను గుర్తించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లో జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేసి తమ సమస్యలను వివరించారు. న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. తన పరిధిలోని వాటికి కలెక్టర్ అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. మిగిలిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు అందజేసి పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ప్రజాసమస్యల పరిష్కారవేదికకు వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పరిష్కారమార్గం చూపించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. పీజీఆర్ఎస్‌పై అధిక ప్రాధాన్యం చూపాలని అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. నేటికి ఆధార్‌కార్డులు లేని ఎస్టీలను గుర్తించి తక్షణమే ఆధార్‌కార్డు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్.సత్తిబాబు, ఆర్డీవో పి.గ్లోరియా, ఉపకలెక్టర్ లక్ష్మీకుమారి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెపండుగ వారోత్సవాలను జయప్రదం

పల్లెపండుగ గ్రామపంచాయతీ వారోత్సవాలు జయప్రదంగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఈ విషయమై సోమవారం సాయంత్రం జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులతో కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు విస్తృతమైన ప్రచారం చేయాలని చెప్పారు. జిల్లాలో 88కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పంచాయతీశాఖ ద్వారా కొన్ని పనులు జరుగుతుండగా మరికొన్ని పనులు జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్వహిస్తున్నట్లు వివరించారు. శ్మశాన వాటికలు, మురుగుకాల్వలు, సీసీరోడ్లు, వసతిగృహాలు, పాఠశాలల ప్రహరీలు నిర్మిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో డ్వామాపీడీ విజయలక్ష్మీ, పీఆర్ఎస్ఈ హరేరామకృష్ణ, డీపీవో కేఎల్ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

దాడులను అరికట్టండి.. ప్రజల పక్షాన పనిచేయండి

● మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున



ఎస్పీ తుషార్ డూడికి సమస్య వివరిస్తున్న మాజీ మంత్రి మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వైసీపీ శ్రేణుల పై జరుగుతున్న దాడులను అరికట్టాలని, అధికారులు ప్రజల పక్షాన పనిచేయాలని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున కోరారు. ఈ విషయమై సోమవారం జిల్లాలోని వైసీపీ సమన్వయకర్తలతో కలిసి ఎస్పీ తుషార్ డూడికి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో జరుగుతున్న దాడులు, హత్యల గురించి ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ శ్రేణులపై దాడులు జరుగుతున్నాయన్నారు. వైసీపీ పాలనలో పార్టీలు చూడకుండా అందరిని సమానంగా చూశామన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గొడవలు, హత్యలు జరుగుతున్నాయన్నారు. పోలీసు అధికారులు దీనిపై స్పందించాలన్నారు. రేపల్లె, చీరాల్లో హత్యలు జరిగాయని, వేమూరు, మార్టూరు, అద్దంకిలో దాడులు జరిగాయని ఆయన ఆరోపించారు. బాపట్లలో జరుగుతున్న సంఘటనలపై స్పందించాలన్నారు. ఎస్పీ తుషార్ డూడి దీనిపై స్పందించి అందరికి న్యాయం చేస్తామని చెప్పినట్లు తెలిపారు. లా అండ్ ఆర్డర్ అండగా ఉంటుదని చెప్పారన్నారు.

21న ప్రమాణ స్వీకారం : మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

వైసీపీజిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి మేరుగ నాగార్జున ఈ నెల 21న ప్రమాణస్వీకారం చేస్తారని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. జమ్ములపాలెం రోడ్డులోని ఎంఎస్ఆర్ కల్యాణమండపం నందు జరిగే ఈ కార్యక్రమానికి పార్టీశ్రేణులంతా కలిసి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె వైసీపీ ఇన్‌చార్జి ఈవూరి గణేష్, వేమూరి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, పట్టణ, మండల అధ్యక్షులు సుధీర్‌బాబు, రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

● మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్



ఏఐ స్మార్ట్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అన్నం సతీష్

బాపట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక పరిజ్ఞానం ప్రతి ఒక్కరు పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని కాకుమాను వారిపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలివేట్ ఏఐ స్మార్ట్ శిక్షణా కేంద్రాన్ని అన్నం సతీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానాటికి పెరిగిపోతున్న సాంకేతికను అందిపుచ్చుకునేందుకు విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అవసరమన్నారు. కావున ఉన్నతశ్రేణి కలిగిన వారి దగ్గర శిక్షణ పొంది ప్రయోజకులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు దండే యజ్ఞ నారాయణ, కాపు సేవాసంఘం అధ్యక్షులు ఇక్కుర్తి శ్రీనివాసరావు, గోపాలం రఘుపతి, సింగం శెట్టి రమేష్, వంకాయలపాటి హరిబాబు, వెంకట్రావు, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

బాపట్లరూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం మరుప్రోలువారిపాలెం పంచాయతీ మద్దిబోయనవారిపాలెం గ్రామంలో సోమవారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా పంచాయతీరాజ్ డీఈఈ పి.రాజన్న, గ్రామనాయకులతో కలిసి సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టారు. మొత్తం 10లక్షల వ్యయంతో మరుప్రోలువారిపాలెం పంచాయతీలో మూడు రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ మోహనరావు, పంచాయతీ కార్యదర్శి ఝాన్సీ, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14 : కూటమి ప్రభుత్వం చేపట్టిన పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని అల్లూరు, అలకాపురం గ్రామపంచాయతీలలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు మంతెన గంగరాజు, చెంచులక్ష్మీ, ఎంపీడీవో ఐ.సత్యనారాయణ, ఈవోపీఆర్డీ కె.ఏలీషాబాబు, సూపరింటెండెంట్ బి.మధుసూధనరెడ్డిలు భూమి పూజలు నిర్వహించి నూతన సీసీరోడ్ల నిర్మాణంకు శంకుస్థాపన చేశారు. అలకాపురం, పెదపాడు, మండేవారిపాలెం ఎస్టీకాలనీ తదితర ప్రాంతాల్లో రూ.27లక్షల70వేలతో నిర్మించే నూతన సీసీ రోడ్లకు, పౌండరిఫామ్‌కు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ మంతెన గంగరాజు, గ్రామ కార్యదర్శి అరుణబాబు, గ్రామపెద్దలు, గ్రామపంచయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ పమిడి చిట్టెమ్మ మృతి

కర్లపాలెం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకురాలు పమిడి చిట్టెమ్మ సోమవారం మృతి చెందారు. పెదగొల్లపాలెంకు చెందిన సీనియర్ నాయకుడు పమిడి వెంకటేశ్వర్లు భార్య పమిడి చిట్టెమ్మ మృతి చెందటంతో పలువురు నాయకులు సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్దనరెడ్డి, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పమిడి భాస్కరరావు తదితరులు సంతాపం ప్రకటించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

జానపద గీతాలు రచయిత జాలాది

● సాహితీభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ

బాపట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ సాహిత్య జగత్తులో కొసరాజు తర్వాత జానపద గీతాలు రచించిన ప్రముఖ కవి జాలాది అని సాహితీభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. సోమవారం రచయిత జాలాది 13వ, సాయి శ్రీహర్ష 14వ వర్ధంతి సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీభారతి కోశాధికారి ఆదం షఫీ, ఉపాధ్యక్షుడు మర్రిమాల్యాద్రిరావులు మాట్లాడుతూ జాలాది 275 చిత్రాల్లో 1500 పాటలు రచించారని, సాయి శ్రీహర్ష 500పాటలు రచించారని అన్నారు. జాలాది, సాయిశ్రీహర్ష చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు

● ఆర్డీవో రామలక్ష్మి



రేపల్లె, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల సూచనల మేరకు లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను రేపల్లె ఆర్డీవో ఎస్ రామలక్ష్మి ఆదేశించారు. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ముంపు ప్రాంత ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కోరారు. ప్రజల సౌకర్యార్థం డివిజన్ కార్యాలయంలో మండల తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతతాధికారులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, భట్టిప్రోలు, అమృతలూరు. కొల్లూరు, చుండూరు, వేమూరుల్లో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశామని అత్యవసర పరిస్థితుల్లో ఆయా కార్యాలయాలను సంప్రదించాలని కోరారు. రేపల్లె రెవెన్యూ డివినజన్ కార్యాలయం ఫోన్ నంబరు 08648 293795లో సంప్రదించాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే నరేంద్రవర్మ



బాపట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీవర్షాల నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కోరారు. ఈ విషయమై సోమవారం ఆయన మాట్లాడుతూ తీరప్రాంత, లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. మత్స్యకారులు చేపలవేటకు వెళ్లరాదని చెప్పారు. మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కాబట్టి అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సేవలందించేందుకు అధికారులు సిద్ధం గా ఉండాలని చెప్పారు. పిడుగులు పడే ప్రమాదం ఉంది కాబట్టి ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. భారీ వర్షాలకు ఇబ్బందులు తలెత్తే ప్రాంతాల్లో ప్రజలకు సహాయక చర్యలు చేపట్టే విధంగా సంబంధితాధికారులతో చర్చించామన్నారు. ప్రజలు అధికార యంత్రాంగానికి సహకరించి సురక్షిత ప్రాంతాలు దాటి బయటకు రావద్దని కోరారు.

● భారతదేశంలో విద్య, భాష వంటి కీలకమైన విషయాల్లో మన పద్ధతులు శాశ్వతంగా ఉంటాయి. కానీ ఇక్కడి వివాహ వ్యవస్థ చాలా పటిష్ఠంగా ఉంది. భార్యాభర్తల మధ్య కంటికి కనబడని బలమైన బంధం, పిల్లలనే బాధ్యతలు ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేశాయి. దీనిని మార్చడం కంటే ఇటువంటి వ్యవస్థలో ఇమిడిపోవడం ఉత్తమం.
- మాక్స్‌ముల్లర్


● భారత దేశాన్ని ఎవరూ ఏమీ చేయలేరు. దీనికి కారణం దేశానికి సరిహద్దులో సైనిక రక్షణ, దేశంలో బలమైన కుటుంబ వ్యవస్థ ఉండటమే. - మహాత్మాగాంధీ

పెద్దలు.. పెళ్లిళ్లు...



సినీ భ్రమ నుంచి యువత బయటకు..

సినిమాల్లో ఎక్కువ శాతం ప్రేమకు సంబంధించినవే ఉంటున్నాయి. వీటిపై యువత ఎక్కువగా ఆకర్షితులవుతుంది. సినిమాల్లో మాదిరిగానే జీవితం ఉంటుందని భ్రమలో ఉంటారు. కానీ వాస్తవ జీవితంలో అవి ఏమీ కనబడవు. నిజానికి యుక్తవయస్సులో తమ జీవిత భాగస్వామిని, కుటుంబ జీవితాన్ని ఎంచుకునే శక్తి యువతకు ఉండదనే చెప్పాలి. కొంత మంది ఆకర్షణనే ప్రేమగా భావిస్తారు. ఆకర్షణ తగ్గగానే వారి మధ్య ఉన్న బంధం బలహీన మవుతుంది. దీంతో వారు విడిపోతున్నారు. ఎక్కువగా ఈ మధ్య ఇటువంటివే జరుగుతు న్నాయి. అందుకే వీటిని చూస్తున్న యువత తమ ఆలోచనలను మార్చుకుందనే చెప్పాలి. అంతేగాక తల్లిదండ్రులను ఎదిరించి వారి మద్ద తు లేకుండా పెళ్లి చేసుకున్న వారి ఇబ్బందులను కూడా చూస్తున్నారు. దీంతో ఎక్కువ మంది యువత పెద్దలు కుదిర్చిన వివాహల వైపే మొగ్గుచూపుతున్నారు. ప్రేమ అయినా, కుదిర్చిన సంబంధాలు అయినా పెద్దల సమక్షంలో జరిగిన పెళ్లిల్లు మాత్రమే బలంగా ఉంటాయి. అందుకే ప్రేమ జంటలు తల్లిదండ్రులను ఒప్పించు కున్న తర్వాతే వివాహం చేసుకోవాలని పెద్దలు చెబుతుంటారు.



● వివాహాలపై మారుతున్న యువత ధోరణి
● భాగస్వామి ఎంపికలో తల్లిదండ్రులదే తుది నిర్ణయం
● ప్రస్తుతం జరుగుతున్న వివాహాల్లో 93 శాతం అలాంటివే

● కులాంతరం అనేకంటే.. అత్యాచారమే మేలు

మిగిలిన వారికంటే కులాంతర, మతాంతర వివాహలు చేసుకున్న జంటలు ఎక్కువగా కష్టాలు పడుతుంటారు. వీరిని ఇరు కుటుంబాలు అంగీకరించవు. మరోవైపు జంటల తల్లిదండ్రులను కూడా బంధువులు దూరంగా పెడుతున్నారు. దీంతో వివాహం చేసుకున్న వారు, వారి తల్లిదండ్రులు జీవితాంతం అనేక అవమానలను అనిభవిస్తున్నారు. అందుకే ఇలాంటి జంటల మధ్య ఏదైనా సమస్య వస్తే తన కూతురు కులాంతర వివాహం చేసుకుంది అనే కంటే ఆత్యాచారానికి గురైంది అని కేసు పెట్టడానికి ముందుకు వస్తున్నారు అంటే వీటిపై పెద్దలు ఎంత వ్యతిరేఖంగా ఉన్నారో అర్థమతుంది. ఢిల్లీలోని 7 జిల్లా కోర్టులో నమోదైన 600 ఆత్యాచారం కేసుల్లో 460 కేసుల తీర్పులను పరిశీలిస్తే ఈ విషయం వాస్తవమేనని తేల్చారు. ఈ కేసుల్లో దాదాపు 40 శాతం సమ్మతి ఉన్న జంటలు పెట్టుకున్న కేసులేనని తేలింది. అంటే తమ పిల్లలు కులాంతర, మతాంతర వివాహలు చేసుకున్నారు అనేకంటే తమ కూతురు అత్యాచారం, అపహరణకు గురైందని కేసు పెట్టడంలో ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పడానికి తలిదండ్రులు సిద్ధపడుతున్నారు.

● దాడులతో రహస్యంగా

కులాంతర వివాహలు చేసుకున్న జంటల్లో ఎక్కువ మంది దాడులకు బయపడుతుంటారు. అందుకే ఇటువంటి వివాహాలు చేసుకున్న వారు తమ వివరాలు ఎక్కడ బయటకు వస్తాయో అనే భయంతో పెళ్లి సర్టిఫికెట్ తీసుకోవడం లేదని రుక్మిణి చేసిన సర్వేలో తేలింది.

● కులానికే ప్రాధాన్యం..

యువత కూడా ప్రస్తుతం కులాంతర, మతాంతర వివాహలపై అనాసక్తి చూపుతున్నారు. వీటిపై పట్టింపు లేదని పైకి చెబుతున్నా గణాంకాలు మాత్రం వేరేలా ఉన్నాయి. 2015లో మ్యాట్రిమన్ల సైట్లలో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న 1000 మంది యువతలో సగం మంది కులం గురించి పట్టింపు లేదని చెబుతూనే పెళ్లి నాటికి అదే కులానికి చెందిన వారిని మాత్రమే ఎంచుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

మతాంతర వివాహలు అంతంతే

2014లో దాదాపు 70 వేల జంటలపై కుల, మతాంతర విషయాలపై ప్రత్యేక సర్వే నిర్వహించింది. వీరిలో పట్టణ ప్రాంతాల్లో 10శాతం కులాంతర, 5 శాతం మతాంతర వివాహలు మాత్రమే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వీరి సంఖ్య పెద్దగా కనబడ లేదు. ఆర్థిక పరమైన అసమానతలు ఉన్నా కొద్దిరోజుల తర్వాత తల్లిదండ్రులు వివాహాలను అంగీకరిస్తున్నారు. కానీ కులాంతర, మతాంతర వివాహలు చేసుకున్న వారిని మాత్రం అంగీకరించడం లేదని, అంతేగాక బంధువులు ఇళ్లలో జరిగే కార్యక్రమాలకు దూరంగా ఉంచుతున్నారని ఇటువంటి వివాహలు చేసుకున్న వారు సర్వే బృందంతో పంచుకున్నారు.

ప్రేమ పెళ్లిళ్లు..

ప్రేమ వివాహంలో సంతోషంగా ఉన్న 3 శాతం జంటల్లో ఎక్కువ శా తం ఒకే వృత్తికి చెందిన వారు ఉండటం విశేషం. వీరిలో అధికంగా డాక్టర్లు ఉన్నారు. మిగిలిన వాటిలో బంధుత్వంలో కూడిన ప్రేమ వివాహలు, సన్నిహిత కుటుంబాల పిల్లల మధ్య జరిగేవి ఉంటున్నాయి. తక్కువ చదువుకున్న అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్న దంపతులు సాన్నిహిత్యంగా ఉన్నారని సర్వేలో పేర్కొనడం మరో విశేషం.

గుంటూరు(తూర్పు), అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి) : రుగ్వేదాన్ని ఆంగ్లంలోకి అనువదించిన బ్రిటీష్ మేధావి మాక్స్‌ముల్లర్ 1856లో తన భార్యకు రాసిన ఉత్తరంలోని సారాంశ మైనా, స్వాతంత్ర్య పోరాట సమయంలో గాంధీ చేసిన పై వ్యాఖ్యలను చూస్తే మన దేశంలో వివాహ వ్యవస్థకు ఎంతటి విశిష్టత, ప్రాముఖ్యత ఉందో తెలుసు కోవచ్చు. ఆయా మతాలకు అనుగుణంగా వివాహం జరిగే విధానం మారవచ్చుకాని, ఆ తర్వాత వారి జీవన విధానంలో, కుటుంబాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఎటువంటి మార్పు ఉండదు. ఇది భారతీయులుగా మనం చేసుకున్న గొప్పతనం అనే కంటే వాటిని నిర్ణయించే పెద్దలదే అని చెప్పాలి. ఎందుకంటే పెళ్లికి సంబంధించి జరిగే ప్రతి తంతులో ఒకటికి పదిసార్లు ఆలోచించి పెద్దలు తీసుకునే నిర్ణయాలే వాటిని ఇంత బలోపేతం చేస్తాయి. అందుకే సాంకేతికంగా ఇంత అభివృద్ధి చెందినా వివాహలు మాత్రం పెద్దలు తీసుకునే నిర్ణయాలకు అనుగుణం గానే జరుగుతున్నాయి. ఇప్పుడు ఇదే విషయాన్ని సర్వేలు కూడా ధృవీకరిస్తున్నాయి. ఏ వయస్సులో పెళ్లి చేసుకోవాలి.. పిల్లలకు ఏమి కావాలి.. ఎటువంటి భాగస్వామి అయితే బాగుంటుంది అనే విషయాలపై తల్లిదండ్రులకు పూర్తి అవగాహన ఉంటుంది. అందుకు యువత పెళ్లి విషయాన్ని తల్లిదండ్రుల నిర్ణయానికే అప్పగిస్తున్నారు.

ఆధునిక పోకడలతో కేసులు

ప్రస్తుతం డేటింగ్, లివింగ్ టు గెదర్, లివింగ్ సెషన్, లివింగ్ సీజన్ అంటూ అనేక పాశ్చత్య పోకడలు మన జీవితాల్లోకి వచ్చాయి. పెళ్లే కాదు ఇద్దరు కలిసి ఉండటానికి ఇవి కూడా మార్గాలు అని చెప్పే ప్రయత్నం చేశాయి. కానీ ఇవి అవి అంతగా ముందుకు వెళ్లలేకపోయాయి. యువతను అంతగా ప్రభావితం చేయలేకపోయాయి. ఇటువంటి బంధాలు రోజులకే పరిమితం అవుతున్నాయి.

ఆకర్షణ తగ్గగానే ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. కొంత మంది అయితే కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. కానీ వందల మంది మధ్యలో జరిగే వివాహ వ్యవస్థలో ఇట ువంటివి ఏమి కనబడవు. ఏదైనా సమస్య వస్తే పరిష్కరించడానికి పెద్దలు ఎలాగూ ఉంటారు. కొన్ని కొత్తదనం తగ్గేలోపు పిల్లలు అనే బాధ్యత వస్తుంది.

అందుకే ఇటువంటి వివాహ బంధాలు నూరేళ్లు ఉంటున్నాయి. అందు కేనేమో ప్రస్తుత యువత ప్రేమ విషయంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నా.. పెళ్లి విషయాన్ని మాత్రం పెద్దలకే వదిలేస్తున్నారు.

బలం చేకూర్చిన సర్వే నివేదికలు

భారతీయ వివాహం, సహచర్యం, ప్రేమ, పెళ్లి వంటి అంశాలపై సీనియర్ పాత్రికేయురాలు రుక్మిణీ కలిమచ్చి తన బృందంతో 2018-2021 నుంచి 25 సంవత్సరాలు దాటిన 1లక్షా 60వేల మంది జంటలపై సర్వే చేసింది.

వీటిలో పెద్దలు కుదిర్చిన వివాహలే 93 శాతం ఉన్నాయని తేల్చింది. 5శాతం ప్రేమ వివాహలు, 2 శాతం పెద్దల అంగీకారంతో కుదిరిన ప్రేమ వివాహలు, ఇతర బంధాలు మరో 2శాతంగా ఉన్నట్లు ధృవీకరించారు. ఇదే బృందం 85 సంవత్సరాల వయస్సు కలిగిన దంపతుల నుంచి వివరాలు సేకరించగా వారిలో దాదాపు 95 శాతం పెద్దలు కుదిర్చిన వివాహలే ఉన్నాయి. అంటే తరాలు మారినా వివాహం విషయంలో తీసుకునే నిర్ణయాల్లో ఎటువంటి మార్పులేదనే వాస్తవాలు నివేదికలు ద్వారా స్పష్టమవుతున్నాయి.

● సంప్రదాయంగానే జరగాలి



ప్రేమ అయిన పెద్దలు కుదిర్చినదైనా ఆయా సంప్రదాయ లకు అనుగుణంగా పెళ్లిళ్ల జరగాలి. అటువంటివే నిలబడతాయి. భారతీయ వివాహ వ్యవస్థ ప్రపంచ దేశాలకు ఆదర్శనీయంగా తీర్చిదిద్ద బడింది. పిల్లలు కూడా తల్లిదండ్రులు అంగీకరించేలా ప్రయత్నం చేయాలేగాని ఎవరూ లేకుండా వివాహలు చేసుకోరాదు. పెద్దవారు కూడా పిల్లలు మనసెరిగి వారికి ఇష్టమైన వివాహలను అంగీకరించేలా ఉండాలి. అప్పుడే భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు రావు.

- కోటా నాగరాజుశర్మ, టీటీడీ వేదపండితులు, సామాజిక విశ్లేషకులు, గుంటూరు

● విభేదాలు.. కేసులు



చాలామంది ప్రేమజంటలు వెంట తెచ్చుకున్న డబ్బులు అయిపోగానే వారి మధ్య విభేదాలు మొదలవుతాయి. వెంటనే కేసులంటూ మాదగ్గరకి వస్తారు. తల్లిదండ్రుల వద్ద ఇబ్బంద లు రాలేదని చెబుతారు. మేము కూడా కేసుల వరకు వెళ్ల కుండా కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగిస్తాం. అలాగే పెళ్లి చేయమని వచ్చే జంటలకు కూడా తల్లిదండ్రుల అంగీ కారం ఉంటే మంచిదని సర్దిచెబుతాం. చాలామంది మొదట్లో వినరు. ఆ తర్వాత మీరు చెప్పిందే నిజమని అంటుంటారు.

- పల్లపు కృష్ణ, పీపీ, గుంటూరు జిల్లా కోర్టు



వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 2 గంటల ఆలస్యం

- అప్పికట్ల వరకు వెనక్కు

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నెంబరు. 20702 తిరుపతి - వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణీకులను తీవ్ర అసౌకర్యానికి గురి చేసింది. సోమవారం మధ్యాహ్నం 3.15 గంటలకు తిరుపతిలో బయలుదేరిన ఈ రైలు రాత్రి 7.45 గంటలకు గుంటూరు రైల్వేస్టేషన్‌కు చేరుకొని 7.50కి సికింద్రాబాద్ బయలుదేరాల్సి ఉన్నది. అయితే మాచవరం - నిడుబ్రోలు రైల్వేస్టేషన్ల మధ్యన రైలుమార్గం కుంగిపోవడంతో రైలుని మాచవరంలో గంటకు పైగా నిలిపేశారు. అనంతరం అప్పికట్ల వరకు వెనక్కు మళ్లించి అప్‌లైన్‌లో తీసుకొచ్చారు. ఈ కారణంగా రాత్రి 9.40 గంటల సమయంలో గుంటూరు రైల్వేస్టేషన్‌కు చేరుకొన్నది. దాదాపుగా రెండు గంటల ఆలస్యం కావడంతో ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ రైలుకు గుంటూరు వరకు కేవలం అల్పాహారం మాత్రమే పంపిణీ చేస్తారు. అయితే రెండు గంటల ఆలస్యం కావడం వలన ఆహారం కోసం ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. ఈ రైలు రాత్రి 11.30 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకోవాల్సి ఉండగా 2 గంటల ఆలస్యం కారణంగా అర్ధరాత్రి 1.30 గంటలకు చేరుకోవచ్చని రైల్వేవర్గాలు అంచనా వేశాయి. కాగా మంగళవారం వందేభారత్ సర్వీసు లేకపోవడం కొంతవరకు మంచిదైంది. ఒకవేళ ఉంటే మంగళవారం కూడా ఈ రైలు ఆలస్యంగా నడపాల్సి వచ్చేది.

టీవీ అండ్ ఫిలిం స్టడీస్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెదకాకాని, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో టీవీ అండ్ ఫిల్మ్ స్టడీస్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ జె మధుబాబు సోమవారం తెలిపారు. రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేషన్ విధానంలో ఈ కోర్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫిలిం మేకింగ్‌లో ఆసక్తి ఉన్నవారు, సినిమా రంగంపై సమగ్ర అవగాహన పెంచుకోవాలనుకునే వారు దరఖాస్తులు చేసుకోవచ్చని వివరించారు. ఈ కోర్సులో డాక్యుమెంటరీ, ఆర్ట్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్షన్, క్రియేటివ్ రైటింగ్, ఎడిటింగ్, స్క్రీన్ రైటింగ్, స్టోరీ బోర్డ్, సినిమాటోగ్రఫీ, ఫిలిం గ్రామర్ వంటి సబ్జెక్టులను బోధిస్తామన్నారు. యూజీసీ ఆదేశాల మేరకు నూతన విద్యా విధానంలో బోధనతో పాటు 50 శాతం ప్రాక్టికల్స్ ఉంటాయన్నారు. ఈ కోర్సులో ప్రవేశాలు పొందేందుకు ఏదైనా డిగ్రీ కోర్స్ ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. కోర్సులో ప్రవేశాలకు, మరిన్ని వివరాలకు 9393110848 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని డాక్టర్ మధుబాబు సూచించారు.

భారీ వర్షాలకు విద్యుత్‌శాఖ కంట్రోల్ రూమ్

● టోల్ ఫ్రీ నెంబర్ 1912కు కూడా ఫోన్ చేయెచ్చు

గుంటూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : వాయుగుండం కారణంగా కుండ పోత వర్షాలకు జిల్లాలో విద్యుత్‌శాఖ ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఇన్‌చార్జ్ ఎస్‌ఈ కేవీఎల్ఎన్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌పరమైన సమస్యలు, అంతరాయాలు వంటి ఫిర్యాదుల కోసం 9440817526 నెంబర్‌తో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అంతేగాక విద్యుత్ సమస్యలపై టోల్ ఫ్రీ నెంబరు 1912 కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో తడిచిన విద్యుత్‌స్థంభాలు తాకవద్దని, ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద మంటలు లేదా శబ్దాలు వచ్చినప్పుడు కంట్రోల్ రూమ్‌కు సమాచారం తెలియజేయాలని కోరారు. గృహాల్లో కూడా విద్యుత్ పరికరాలు వినియోగించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఫోర్జరీ సంతకాలతో అగ్రిమెంట్ సృష్టించి బెదిరింపు

● అడిగినంత బ్రోకరేజి ఇవ్వలేదని మోసం

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : తాను విక్రయించిన పొలానికి మీడియేటర్ గా వ్యవహరించిన వ్యక్తికి అడిగినంత బ్రోకరేజి ఇవ్వలేదనే కారణంగా తన పొలానికి ఫోర్జరీ సంతకాలతో తప్పుడు అగ్రిమెంట్లు సృష్టించి తనను బెదిరిస్తున్నాడని గోరంట్ల అన్నపూర్ణ నగర్‌కు చెందిన అల్లాడి ప్రసాదరావు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పొన్నెకల్లులోని ఐదు ఎకరాల భూమిని జూలై 10న 12.5 కోట్లకు విక్రయించేలా అగ్రిమెంటు కుదుర్చుకొని ఇందుకు గాను మూడు కోట్ల 50 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో మీడియేటర్‌గా ఉన్న వ్యక్తి ఎకరానికి రెండు లక్షలు చొప్పున బ్రోకరేజ్ ఇవ్వాలని అడగ్గా అంత ఇవ్వనని చెప్పినందుకు తన పొలా నికి 2018లో తాను ఆయనకు కోటిన్నరకు విక్రయించేలా ఒప్పందం చేసుకున్నానని అం దులో కోటి 25 లక్షలు తనకు ఇచ్చినట్లుగా తప్పుడు ఒప్పంద పత్రం సృష్టించి మోసపూరితంగా తనను బెదిరిస్తున్నాడని ప్రసాదరావు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని, తనకు ప్రాణ రక్షణ కల్పించాలని కోరారు.

ఏపీ లాసెట్ 2024 నోటిఫికేషన్ విడుదల

పెదకాకాని, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ లాసెట్, పీజీ లాసెట్ 2024కు సంబంధించిన అడ్మిషన్స్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి సత్యనారాయణ తెలిపారు. ఏపీలోని న్యాయశాస్త్ర కళాశాలలో ఈ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రవేశాల కౌన్సెలింగ్, రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య కే గంగాధరరావు విడుదల చేశారని పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి 20 వరకు వెబ్ కౌన్సెలింగ్, రిజిస్ట్రేషన్ నమోదు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ ద్వారా ఈ నెల 22 నుంచి 25 వరకు కళాశాలలను ఎంపిక చేసుకోవచ్చని, వెబ్ ఆప్షన్‌లో మార్పులు ఈ నెల 26న చేసుకోవచ్చనని పేర్కొన్నారు. అలాగె స్పెషల్ కేటగిరీకి చెందిన అభ్యర్థులు ఈ నెల 19 న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ప్రవేశాల విభాగం వద్ద ఏపీ లాసెట్ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ నెల 28న అడ్మిషన్ల అలాట్ మెంట్ జరుగుతుందని తెలిపారు. ఆయా కళాశాలలో ప్రవేశం పొందిన అభ్యర్థులు ఈ నెల 29, 30 తేదీలలో హాజరు కావాలని సూచించారు.



లాసెట్ కౌన్సెలింగ్, రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియను విడుదల చేస్తున్న వీసీ ఆచార్య కే గంగాధరరావు, ఆచార్య సత్యనారాయణ తదితరులు.

మద్యం లాటరీలో భార్యాభర్తల అదృష్టం

పెదకూరపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో సోమవారం పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు, పెదకూరపాడు ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో 20 మద్యం దుకాణాలకు లాటరీ లాటరీ నిర్వహించారు. ఈ లాటరీలో విజయవాడకు చెందిన యండ్రాతి శ్రీనివాసరావుకు ఐదు మద్యం దుకాణాల అదృష్టం వరించింది. పెదకూరపాడు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లోని 121, 123, 124, క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బెల్లంకొండ మండలంలో ఒకటి, క్రోసూరు మండలం ఒక మద్యం దుకాణాన్ని లాటరీలో శ్రీనివాసరావు గెలుచుకున్నారు. అమరావతిలో శ్రీనివాసరావు సతీమణి శివ కుమారి పేరుతో కూడా మరో మద్యం దుకాణం లాటరీలో వారి వశమైంది. నియోజక వర్గం మొత్తంలో 20 మద్యం దుకాణాలకు గాను ఆరు మద్యం దుకాణాలు ఒకే వ్యక్తి పేరుతో ఐదు, సతీమణి పేరుతో మరొకటి రావటంతో శ్రీనివాసరావు గొప్ప అదృష్ట వంతుడంటూ నియోజక వర్గ ప్రజలు పేర్కొంటున్నారు. సిండికేట్‌గా ఏర్పడి అధిక మొత్తంలో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నా సిండికేట్లకు నిరాశే మిగిలింది.

వీవీఐటీలో పొట్టేల్ చిత్ర బృందం సందడి

పెదకాకాని, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : యువచంద్రకృష్ణ, అనన్య నాగళ్ల జంటగా సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న చిత్రం " పొట్టేల్" ఈ నెల 25వ తేదీన విడుదల కానుంది. ఈ చిత్రం ప్రచార కార్యక్రమంలో భాగంగా చిత్రబృందం హీరో యువచంద్రకృష్ణ, అనన్య నాగళ్ల, నటుడు నోయల్, డైరెక్టర్ సాహిత్ వీవీఐటీ కళాశాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా హీరో యువచంద్రకృష్ణ మాట్లడుతూ పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు పడే కష్టమే ఇతివృత్తంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించామనీ, విద్యార్థులు ఈ చిత్రాన్ని తప్పకచూడాలని కోరారు. యువతను అలరించే అన్ని అంశాలను ఈ చిత్రంలో పొందుపరిచినట్లు తెలిపారు. వీవీఐటీ విద్యార్థి గాయత్రి తాను పెన్సిల్‌తో గీసిన చిత్రాన్ని హీరో, హీరోయిన్‌లకు అందించింది. అనంతరం విద్యార్థులతో కలసి గీతాలాపన, నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు.



వీవీఐటీ విద్యార్థి గాయత్రిని అభినందిస్తున్న చిత్రం బృందం

మద్యం షాపుల బిడ్డర్ల జాబితా

వేమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సోమవారం లాటరీ పద్ధతి ద్వారా మద్యం షాపుల బిడ్డర్ల జాబితాను ప్రకటించినట్లు వేమూరు ఎక్సైజ్ ససీఐ రవి తెలిపారు. 12 షాపులకు గాను 198 దరఖాస్తులు అందినట్లుగా మండలాల వారీగా లాటరీ పద్ధతిలో బిడ్డర్లను గుర్తించినట్లు తెలిపారు. వేమూరు మండలంలో మూడు షాపులకు గాను 64 మంది దరఖాస్తు చేశారు. వారిలో 57, 58, 59 షాపులకు కేశం రఘురాం, షేక్ షరీఫ్, కొత్తపల్లి శ్రీనివాసరావు వాటిని దక్కించుకున్నారు. అమృతలూరు మండలంలోని రెండు షాపులకు 35 మంది దరఖాస్తు చేశారు. 60, 61 షాపులను మల్లప్పరెడ్డి తేజ, చమట నాగేశ్వరరావు దక్కించుకున్నారు. చుండూరు మండలంలోని మూడు షాపులకు 43 మంది దరఖాస్తు చేశారు. 62, 63, 64 నెంబర్లు కలిగినషాపులను తుల్లిమిల్లి భాస్కరరావు, బండ్రెడ్డి రమణ, తుల్లిమిల్లి భాస్కరరావులు దక్కించుకున్నారు. కొల్లూరు మండలంలో నాలుగు షాపులకు 56 మంది దరఖాస్తు చేశారు. 65, 66, 67, 68 షాపులను వేములపల్లి వెంకటనాగార్జున చౌదరి, నంగు సాంబిరెడ్డి, టి.భరత్‌కుమార్, జెర్రిపోతుల రామకృష్ణలు షాపులను దక్కించుకున్నట్లు సీఐ వివరించారు.

టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

రేపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రేపల్లె నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్‌హాలులో జరగనున్నట్లు టీడీపీ రాష్ట్ర స్థాయినాయకులు జీవీ నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యఅతిథిగా రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొంటారని, నియోజకవర్గంలోని మండల స్థాయి, బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు హాజరుకావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

వేమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను ఆదివారం రాత్రి వేమూరు పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఎస్‌ఐ రవి కృష్ణ రాత్రి గస్తి సందర్భంలో వేమూరు మార్కెట్ యార్డు వద్ద మూడు ట్రాక్టర్లను జంపని షుగర్ ఫ్యాక్టరీ వద్ద రెండు ట్రాక్టర్లను గుర్తించి స్టేషన్‌కు తరలించారు. కొల్లూరు మండలం పెసర్లంకకు చెందిన శొంఠి కర్ణుడు, మాజేటి శ్రీమన్నారాయణ, కొల్లూరుకు చెందిన ఇంటూరి ఏసుపాదంలు ట్రాక్టర్లు వదిలి పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చావలి కార్యదర్శి శ్రీనివాసరావు మృతి

వేమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చావలి గ్రామ పంచాయతీ కార్యదర్శి గాజుల శ్రీనివాసరావు (50) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. శ్రీనివాసరావు ఆకస్మిక మృతికి సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు, ఎంపీడీవో శివన్నారాయణ, కార్యాలయం సిబ్బంది, సంతాపాన్ని తెలియజేశారు.

వర్షంతో జనజీవనం

● లోతట్టుప్రాంతాల్లో నిలిచిన వర్షపునీరు ● రోడ్లపై కాల్వలా ప్రవహిస్తున్న నీరు

బాపట్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అల్లాడిపోతున్నారు. మురికివాడల్లో ఇళ్ళ చుట్టూ చేరిన వర్షపునీటికితోడు మురుగునీరు కలవటంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ప్రతిసారి వర్షం వచ్చినప్పుడు అధికారులు మొక్కుబడిగా వచ్చి పరిశీలించి తాత్కాలిక చర్యలు చేపట్టి వదిలేస్తున్నారు. విపత్తుల సమయంలో ప్రజలు పడుతున్న ఇక్కట్లు వర్ణనాతీతం. బాపట్ల పట్టణంలోని 3వవార్డు రాజీవ్‌గాంధీకాలనీలోని ఖాళీ లేఅవుట్‌లలో వర్షపునీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. ఎస్టీ గృహాల చుట్టూ వర్షపునీరు రెండునెలలుగా నిలిచిఉంది. నీటిని బయటకు పంపించి ప్రత్యేకశానిటేషన్ చేపట్టటంలో అధికారులు విఫలమయ్యారు. ఫలితంగా విషజ్వరాలతో ఈప్రాంత ప్రజలు అల్లాడుతున్నారు. బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదురు హైవేరోడ్డుపై నీరు నిలిచి తటాకాన్ని తలపిస్తున్నది. వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల ఎదుట కూడా వర్షపు నీరు రోడ్డుపై నిలిచింది. రోడ్డుపై నిలిచిన నీరు డ్రైనేజిలలోకి వెళ్లటంలేదు. ఈ విషయంలో సంబంధితాధికారులు ఏవిధమైన చర్యలు చేపట్టకపోవటం వల్ల వర్షం వచ్చిన ప్రతిసారి సమస్య తాండవిస్తున్నది కావున సంబంధితాధికారులు దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

● కర్లపాలెం మండలంలోని రాజీవ్‌గాంధీకాలనీలో సీసీరోడ్డుపై మోకాలు లోతుకు పైగా వర్షపునీరు నిలిచి ఉంది. వర్షం వస్తే ఇక్కడ ఇదే సమస్య ఈప్రాంత ప్రజలు తాగునీరు తెచ్చుకోవటానికి వర్షపు నీటిలో నడుచుకుంటూ వెళ్లి తెచ్చుకోవాల్సిందే. దశాబ్దాలుగా ఇక్కడ ఈ సమస్య ఉన్నప్పటికి దీని పరిష్కారానికి పాలకులు, అధికారులు ఏవిధమైన చర్యలు తీసుకోవటంలేదు. రోడ్డును మెరక చేయటం లేదా డ్రైనేజి వ్యవస్థను అభివృద్ది చేయటం వల్ల సమస్యకు పరిష్కారం లభిస్తుంది. మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల గ్రౌండ్ పల్లంకావటంతో నీరు నిలిచి ఉంది. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించి గ్రౌండ్ మెరక చేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఆదిశగా అధికారులు పనిచేయాల్సి ఉంది. పిట్టలవానిపాలెం మండలంలోని చందోలుగ్రామంలో మెయిన్ రోడ్డు నుంచి హబీబుల్లా స్ట్రీట్‌కు వెళ్ళే రోడ్డుపై వర్షపునీరు నిలిచి రాకపోకలకు విఘాతం కలిగిస్తున్నది. సమస్యను అధికారుల దృష్టికి అనేకసార్లు తీసుకెళ్ళిన ఫలితం లేకుండాపోయిందని ఆప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు.


తటాకాన్ని తలపిస్తున్న వ్యవసాయ మార్కెట్‌యార్డు ఎదురు హైవేరోడ్డు


కర్లపాలెంలోని ఇందిరానగర్ మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిలిచిన వర్షపునీరు

కూరగాయల తోటలకు దెబ్బ

నియోజకవర్గంలోని గరువు మెరక భూముల్లో సాగు చేసే కూరగాయలు, ఆకుకూరల తోటలకు వర్షం దెబ్బ తగిలింది. పచ్చిమిర్చి తోటలలో వర్షపునీరు చేరింది. బీరతోటల్లో నీరు నిలిచింది. కర్లపాలెం మండలంలోని కొత్తనందాయపాలెంలో నీటిలో నిలిచిన తోటలను రక్షించుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి తర్వాత ప్రారంభమైన వర్షం సోమవారం రాత్రి వరకు ఉరుములు, మెరుపులతో భారీవర్షం కురుస్తున్నది. తోటలో నీరు నిలిచి పంటలు దెబ్బతినే ప్రమాదం ఉంది. మరో మూడురోజులపాటు భారీవర్షాలు పడుతాయని ప్రకటించిన నేపథ్యంలో పంటలను వదిలేసుకోవాల్సిందేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● భారీవర్షాల నేపథ్యంలో సోమవారం ప్రభుత్వ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారి సెలవు ప్రకటించటంతో పాఠశాలలు మూసివేశారు.


కొత్తనందాయపాలెం గ్రామంలోని బీరతోటలో నిలిచిన వర్షపునీరు

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి, సంక్షేమం

● నియోజకవర్గంలో రూ.11 కోట్లతో 64 పనులు
● ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలన ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తామని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన వెల్లబాడు, కుచ్చెళ్లపాడు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామీణ ఉపాధి పథకం నిధులు కోట్ల రూపాయల ద్వారా 64 పనులు చేపట్టేందుకు శంకుస్థాపనలు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రజాహితమైన ఆలోచన ధోరణిలో సేవకులుగా పని చేస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అడుగులు వేస్తున్నారన్నారు. రాష్ట్రం ఆర్థి కంగా అన్ని రకాలుగా జగన్ ముఖ్యమంత్రి కావడం వల్ల దెబ్బతిందని, 20 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందన్నారు. చంద్రబాబు సారధ్యంలో పవన్ నేతృత్వంలో పల్లెసీమలను ప్రగతి సీమలుగా మార్చేందుకు జాతీయ ఉపాధి పథకం నిధులను అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామ పంచాయితీలకు విడుదల చేయడం జరిగిందన్నారు. సంపద సృష్టించే విధానంలో చంద్రబా బు అనేక విధానాలను అమల్లోకి తీసుకువస్తారన్నారు. పంచాయతీ వారోత్సవాల్లో మొదటి రోజున చుండూరు మండలం యడ్లపల్లిలో రూ.25 లక్షలు, అమృతలూరు మండలంలో 30 లక్షలు, వేమూరు మండలంలోని కుచ్చెళ్లపాడులో రూ.10 లక్షలు, వెల్లబాడు లో రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ స్థాయి అధికారి ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, సర్పంచ్ గాజుల వెంకటసుబ్బయ్య, జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, జిల్లా కార్యదర్శి అనురాధ, మండల ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, తాడికొండ సుధీర్‌బాబు, వి.ఆంజనేయులు, బాపట్ల పార్లమెంట్ తెలుగుయువత ఉపాధ్యక్షుడు అమ్మిశెట్టి కిషోర్‌బాబు, కొల్లి పండు బాబు, యల్లమాటి రాజేష్, రాజు, తహసీల్దార్ సుశీల, ఎంపీడీ వో శివన్నారాయణ, శేఖర్, ఏపీవో సత్యకృష్ణ, పంచాయతీరాజ్ డీఈ ఈ శ్యాంప్రసాద్, ఏఈ బదిరీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కుచ్చెళ్లపాడులో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

పల్లెపండుగలో రహదారులకు శంకుస్థాపనలు

రేపల్లె, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం లక్ష్యమని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో సోమవారం 'పల్లెపండుగ' నిర్వహించారు. ఇందులో భాగంగా రహదారులకు భూమిపూజ, శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ మంత్రి సహకారంతో నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు నిధులు తెచ్చారని అన్నారు. ప్రతి పంచాయతీలో రూ.20 లక్షలు పైనే వెచ్చించి ఆయా గ్రామాల్లో రహదారులను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టిసారించి రాష్ట్రంలో రూ.4,500 కోట్లతో రహదారులను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరుపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ 130 రోజుల్లోపే గ్రామాలు అభివృద్ధి బాట పడుతున్నాయన్నారు. రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాలపై దృష్టిసారించి అంతర్గత రహదారుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వి.వీరయ్య, నిజాంపట్నం జడ్పీటీసీ ఎస్ సుబ్బయ్య, టీడీపీ నాయకులు కె.రాజశేఖర్, ఎం.శివరామకృష్ణ, టి.ఏడుకొండలు, కుమారస్వామి, బి.రామకృష్ణ, ఎం.రామకృష్ణ, ఎం.హరనాథబాబు,కె.రాము, కె.రాము, అధికారులు పాల్గొన్నారు.


నగరం గ్రామంలో సీసీరోడ్డుకు భూమిపూజ చేస్తున్న అనగాని శివప్రసాద్

ప్రజాసమస్యల పరిష్కారవేదికకు అత్యధిక ప్రాధాన్యం

బాపట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజల చట్టపరమైన సమస్యలు పరిష్కరించటానికి ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అనేక మంది అర్జీల ద్వారా తమ సమస్యలను వివరించారు. కుటుంబ సమస్యలు, అత్తారింటి వేధింపులు, ఆర్థికమోసాలు, భూవివాదాలు ఇతర పలురకాల సమస్యలను చెప్పుకోవటానికి వచ్చిన వారితో ఎస్పీ స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకొని ఆయా పోలీసుస్టేషన్‌ల అధికారులకు సమస్య తెలియజేసి పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని చెప్పారు. చట్టపరిధిలో నిర్ణీత గడువులోగా సమస్య పరిష్కారం కావాలన్నారు. అర్జీదారుల సమస్యలను పరిష్కరించటానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని ఎస్పీ ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 29 మంది వర్షంతో సైతం వచ్చి తమ సమస్యలను వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ జి.రామాంజనేయులు, సీఐ యు.శ్రీనివాసులు, పోలీసుసిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలి

తమ భూమిపై ఇతరులకు కౌలుదారులు కార్డులు అందించటమే కాకుండా ప్రశ్నించిన తమపై తప్పుడు కేసులు పెడుతున్న వీఆర్వో పులి సీతయ్యపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వేమూరు మండలం చంపాడు గ్రామానికి చెందిన మోటుపల్లి చైతన్యకుమార్, అనూషలు సోమవారం ఎస్పీ తుషార్ డూడీని కోరారు. తప్పుడు ధ్రువీకరణపత్రాలు ఇస్తున్న వీఆర్వో సీతయ్యపై నాలుగుసార్లు కలెక్టర్‌కు, రెండుసార్లు ఎస్పీకి, ఒకసారి ముఖ్యమంత్రికి కూడా ఫిర్యాదు చేసినట్లు వారు వివరించారు.

పల్లె పండుగ వారోత్సవాలు

కొల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):మండలంలోని నుగ్గునలంక, చిలుమూరులంకలో సోమవారం పల్లెపండుగను అధికారులు నిర్వహించారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీడీవో కె.నరసింహారావు భూమి పూజ చేశారు. ఒక్కో గ్రామంలో రూ.10 లక్షల అంచనాలతో ఉపాధి హామీ నిధులతో 170 మీటర్ల సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశా రు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డి సునీత, ఏపీవో జయలక్ష్మి, పీఆర్ ఏఈ పాపారావు, శీలం అంకమ్మరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 14 : మండల గ్రామం గోరికపూడిలో పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ లలితకుమారి గోకులానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లిక, ఎంపీటీసీ పున్నయ్య, ఎంపీడీవో రమణ, ఈవోపీఆర్‌డీ ఊహారాణి, ఏపీవో శివపార్వతి పాల్గొన్నారు.


గోరికపూడిలో పల్లెపండుగలో పాల్గొన్న ఎంపీపీ లలితకుమారి


రేపల్లెమండలం వర్షంకారణంగా జలమయమైన రహదారి

రేపల్లె, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా నియోజకవర్గంలోని పలుప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. రేపల్లె, నిజాంపట్నం మండలాల్లో ప్రధాన రహదారులన్నీ జలమయం కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలోని జగనన్నకాలనీ చుట్టూ వర్షపునీరు చేరడంతో స్థానికులకూ ఇబ్బంది తప్పట్లేదు. వరి పొలాల్లో వర్షపు నీరు నిలవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తీరంలో భారీవర్షం

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంనాటి నుంచి అధిక వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. అల్పపీడన ద్రోణి తో వర్షం కారణంగా మిగిలిన పంటకూడా పోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


బేతపూడిలో వర్షంకారణంగా నీటమునిగిన పంటపొలాలు

మారనున్న గ్రామాల రూపురేఖలు

ఏల్చూరులో రూ.40లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గోపాపురం భూములకు త్వరలో పరిష్కారం

పల్లెపండుగ కార్యక్రమంలో మంత్రి రవికుమార్

ఏల్చూరు(అద్దంకి), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పల్లె పండుగ నిధులతో గ్రామాల రూపురేఖలు మారనున్నాయని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సంతమాగులూరు మండలంలోని ఏల్చూరులో రూ.40 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, సైడు కాలువలకు సోమవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గంలో రూ.67కోట్లతో పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు ద్వారా సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌లు, గోకులాల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం ఇతర పలు రకాల పనులు చేపడతారన్నారు. ఆ సమయాల్లో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. సీసీ రోడ్డు వేసినంత దూరం కచ్చితంగా సైడ్ డ్రైన్‌ల నిర్మాణం చేయాలని, పైప్ కల్వర్టుల స్థానంలో స్లాబ్ కల్వర్టులను ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి సమస్యను ఏల్చూరు గ్రామస్థులు రవికుమార్ దృష్టికి తీసుకురాగా, గతంలో మూడు ఆర్వో ప్లాంట్‌లు, మంచినీటి పథకం ఏర్పాటు చేస్తే ఆర్వో ప్లాంట్‌లను వ్యాపారంగా మార్చి నిర్వీర్యం చేసి మూసి వేశారన్నారు. అసిస్ట్ సహకారంతో గ్రామంలో 4 కొత్త నీటి ప్లాంట్‌లను చేయిస్తామని హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతి రోజు ఉదయం గ్రామాలలో పర్యటించి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు డ్రైన్‌లలో పూడిక తీత పనులు చేయించాలన్నారు. వర్షాకాలం అయినందున పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వైసీపీ పాలనలో కేంద్ర ప్రభుత్వం నుంచి పంచాయతీలకు విడుదలయ్యే నిధులు పక్కదారి పట్టించారన్నారు. ఇప్పుడు నేరుగా పంచాయతీలకే జమ అవుతున్నాయని, ఆ నిధులు దుర్వినియోగం కాకుండా పనులు చేయించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నారు. గోపాపురం భూముల సమస్యను త్వరలో పరిష్కరించి సాగు రైతులకు పట్టాలు అందజేస్తామని మంత్రి రవికుమార్ రైతులకు తెలిపారు. ఎస్టీ కాలనీలో గుడిసెలు అడ్డదిడ్డంగా వేసుకొని ఉన్నందున అభివృద్ధి పనులకు అడ్డంకిగా ఉన్నాయని స్థానికులు, రెవెన్యూ అధికారులు కలిసి ప్లాట్లుగా విభజించి కేటాయిస్తే అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు

పెద్దదోర్నాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్‌ను సచివాలయంలో ఎర్రగొండపాలెం నియోజకవర్గ బీజేపీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వెనుకబడిన నియోజకవర్గంలో వైద్యశాలల అభివృద్ధి, పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు తోడ్పాటు నివ్వాలని ఆయనను కోరారు.

లిక్కర్ వ్యాపారంలో ఆరితేరిన వ్యాపారుల, రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తుల ప్రభావం మళ్లీ ఆరంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపుల కేటాయింపునకు పూర్తి పారదర్శక విధానం అవలంబించింది. అయినా వివిధ రూపాల్లో ఆరితేరిన లిక్కర్ వ్యాపారులు, రాజకీయ నేపథ్యం కలిగిన వ్యక్తులు అధికసంఖ్యలో మద్యం షాపులను చేజిక్కించుకోగలిగారు. అయితే కొంతమందికి లాటరీ కలిసిరాలేదు. కొత్తగా ఆకర్షితులైన వారిని మాత్రం అదృష్టం వరించింది. స్థానికేతరులు సులువుగా డబ్బు సంపాదించవచ్చనే ఆలోచనతో దరఖాస్తులు చేసి లాటరీలో దక్కించుకున్న వారికి అప్పుడే సమస్యలు ఆరంభమయ్యాయి. 'తులమో ఫలమో ఇస్తాం, మీ కొచ్చిన షాపులు మాకు ఇచ్చి వెళ్లిపోండి' అంటూ మద్యం వ్యాపారులు వారిపై వత్తిడి ఆరంభించారు.

- (ఆంధ్రజ్యోతి, ఒంగోలు)



లిక్కర్ రాజకీయం ఆరంభం

పాత వ్యాపారులు, రాజకీయ నేతలు రంగప్రవేశం

లాటరీ అదృష్టవంతులను తరిమికొట్టే ప్రయత్నం

షాపుల అమ్మకానికి వత్తిడి, బేరసారాలు

పకడ్బందీగా లాటరీ విధానం

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 250కిపైగా మద్యం విక్రయ షాపులకు సోమవారం లాటరీ విధానంలో విక్రయదారులను ఎంపిక చేశారు. ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకున్నా ఒకటి రెండు ప్రాంతాల్లో అధికార పార్టీ నేతలు సిండికేట్‌గా దరఖాస్తులు దాఖలు చేశారు. అయితే వారి కళ్లుగప్పి మరికొందరు చివరిక్షణంలో దరఖాస్తులు పెట్టుకున్నారు. దరఖాస్తు దాఖల్లో అంతోఇంతో లొసుగులు కనిపించినా లాటరీ విధానాన్ని ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహించింది. దీంతో లాటరీలో అదృష్టవంతులకే షాపులు దక్కాయి. ఉదాహరణకు ఒంగోలు, సంతనూతలపాడులో లిక్కర్ వ్యాపారులు అలాగే అధికారపార్టీ స్థానిక నేతలు వేర్వేరుగా సిండికేట్ అయి దరఖాస్తులు వేశారు. రెండు గ్రూపుల వారిని కళ్లుగప్పి కొత్తగా ఈ వైపు దృష్టిసారించిన అనేకమంది యువకులు దరఖాస్తులు వేశారు. ఎక్కువ ఆ రెండు గ్రూపుల వారికే వచ్చినా మధ్యలో కొత్త వారిని కూడా అదృష్టం వరించి కొన్ని షాపులు దక్కాయి.

ప్రముఖుడికి దక్కని షాపులు

వ్యాపారంలో ఆరితేరిన ఒక ప్రముఖుడు జిల్లా మొత్తంగా 25 షాపులకు దరఖాస్తులు పెట్టుకున్నా అదృష్టం వరించలేదని తెలిసింది. మార్కాపురంలో ఎక్కువ షాపులు పాత వ్యాపార ప్రముఖులు, టీడీపీ, జనసేన నాయకుల మద్దతు ఉన్న వారికే దక్కాయి. నియోజకవర్గం మొత్తంపై మూడు షాపులు వైసీపీ సానుభూతిపరులకు, నాలుగైదు షాపులు కొత్తవారికి దక్కాయి. గిద్దలూరు సర్కిల్‌లో ఒక షాపునకు ఒకే ఒక్క దరఖాస్తు వేసిన వైసీపీ సానుభూతిపరుడిని అదృష్టం వరించింది. మిగిలిన షాపులు ఎక్కువ భాగం టీడీపీ అనుకూల వ్యక్తులకు దక్కగా అక్కడ కొన్ని షాపులు కొత్తవారు చేజిక్కించుకున్నారు. దర్శిలో స్థానికేతరులకు సైతం కొన్ని షాపులు దక్కాయి. కనిగిరిలో మద్యం వ్యాపారంలో ఆరితేరిన పాతవారు ఈసారి దూరంగా ఉండగా ప్రస్తుతం రాజకీయంగా చురుగ్గా ఉన్నవారే గ్రూపుగా షాపులు దక్కించుకున్నారు. అయితే ఈ నియోజకవర్గంలోను కొత్తవారిని కొన్ని వరించాయి.

స్థానికేతరులకు దక్కిన షాపులు

కొండపి నియోజకవర్గంలో కొన్నిచోట్ల స్థానికేతరులకు షాపుల దక్కాయి. కందుకూరు నియోజకవర్గంలో ఆరు, ఏడు షాపులకు దరఖాస్తులు చేసిన టీడీపీ స్థానిక నేతకు ఒక్క షాపు దక్కలేదు. లిక్కర్ వ్యాపారంలో కొందరికి ఒకటి అర షాపులు దక్కగా కొందరిని అదృష్టం వరించలేదు. ఈ నియోజకవర్గంలోను కొత్తగా ఆ వైపు దృష్టిసారించిన యువకులకు అడపాదడపా అదృష్టం వరించింది. అద్దంకి నియోజకవర్గంలో ఇద్దరు ప్రముఖులకు ఒక్క షాపు లభించలేదు. పాత వ్యాపారులతోపాటు కొత్తగా రంగంలోకి వచ్చిన వారిని అదృష్టం వరించింది. పర్చూరు నియోజకవర్గంలో అమెరికా నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారిని అదృష్టం వరించింది. చీరాల నియోజకవర్గంలో రాజకీయ మద్దతు కూడా ఉన్న ఒకరిద్దరికీ ఒక్క షాపు దక్కకపోగా ఈ వ్యాపారంలో కొత్తగా అడుగు పెడుతున్న వారికి కొన్ని షాపులు దక్కాయి.

బేరసారాలు, బెదిరింపులు

లాటరీ విధానంలో షాపులు దక్కించుకోలేకపోయిన వ్యాపార ప్రముఖులు, రాజకీయ పలుకుబడి కలిగిన వారు కొత్తవారితో బేరసారాలకు దిగారు. మీరే షాపులను నడుపుకోవాలంటే ఇబ్బందులు పడక తప్పదంటూ బెదిరింపులు కూడా చేస్తున్నారు. 'మీ దరఖాస్తు ఫీజుతోపాటు రెండేళ్లకు సంబంధించి కొంత మొత్తాన్ని ఇస్తాం, షాపులు మేము నడుపుకుంటాం అందుకు అంగీకరించండి' అంటూ బేరసారాలకు దిగారు. కాదు కూడదంటే బెదిరింపులకు దిగారు. ఇటు రాజకీయ పలుకుబడి లేని వ్యాపార అనుభవం లేని వారికి నిబంధనలు కూడా ఇబ్బందిగా మారాయి. ఒక్కరోజు వ్యవధిలో అంటే బుధవారానికి వారు షాపు ఏర్పాటు చేసుకోవాలి. లైసెన్స్ ఫీజు కట్టాలి. వెంటనే విక్రయాలు ప్రారంభించాలి. లిక్కర్‌ను ఆర్డర్ పెట్టి తగు పద్ధతిలో తెచ్చుకోగలగాలి. షాపు ఏర్పాటులో జాప్యం చేసుకుంటే రోజువారి వచ్చే ఆదాయం కోల్పోతారు. అనువైన ప్రాంతలో షాపు పెట్టుకోలేకపోయినా, వ్యాపారపరంగా కొంత నష్టపోవాల్సి వస్తుంది. ఇవన్నీ కొత్తగా ఈ వ్యాపారంలోకి వచ్చిన వారికి ఇబ్బందికరంగా మారాయి. దీనికితోడు పాత వ్యాపారులు తమకు షాపు ఇవ్వకపోతే రేపు నిర్వహణలో ఎక్సైజ్ అధికారులతో తనిఖీలు, కేసులు పెట్టిస్తామంటూ బెదిరిస్తున్నారు. లాటరీలో షాపు పొందిన స్థానికేతరులకైతే మీకు స్థానికంగా పెట్టుకునేందుకు అద్దె షాపులు కూడా ఇవ్వనీయమంటూ బెదిరిస్తున్నారు. తద్వారా లాటరీలో అదృష్టం వరించిన కొత్తవారికి లిక్కర్ వ్యాపార ప్రముఖుల నుంచి ఆరంభంలోనే ఇబ్బందులు ఎదురై లిక్కర్ రాజకీయం స్పష్టంగా కనిపిస్తోంది.

లిక్కర్ లక్కు

- మహిళలకు దక్కిన 15 దుకాణాలు
- వర్షంలోనూ మద్యం షాపులకు లాటరీ
- తొలివిడత లైసెన్స్ ఫీజు రూ.17.50 కోట్లు
- దరఖాస్తుల ద్వారా రూ.69.32 కోట్లు
- రేపటి నుంచి ప్రైవేటు వైన్ షాపులు ప్రారంభం

ఒంగోలు క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం షాపుల కేటాయింపు ప్రక్రియ ముగిసింది. ఈనెల 16 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభించనున్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పర్యవేక్షణలో లాటరీ ప్రక్రియ ద్వారా 171 వైన్ షాపులకు కేటాయింపులు పూర్తిచేశారు. మొత్తం 3,466 దరఖాస్తులు రాగా అందులో 50 మందికిపైగా మహిళలు ఉన్నారు. ఇందులో 15 మందిని అదృష్టదేవత వరించింది. వారికి మద్యం దుకాణాలు కేటాయించారు. దరఖాస్తుల ద్వారా రూ.69.32 కోట్ల ఆదాయం రాగా లైసెన్సీ ఫీజు రూపంలో తొలివిడతగా రూ.17.50 కోట్లు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. జోరున వర్షం పడుతున్నా లాటరీ తీస్తున్న అంబేడ్కర్ భవన్ వద్ద దరఖాస్తుదారులలు తడుస్తూనే వేచి ఉన్నారు. అధికారులు రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి ఐదు గంటల్లో లాటరీ ప్రక్రియను పూర్తిచేశారు. ఉదయం 8 గంటలకు కలెక్టర్ ఒంగోలు 1 నంబరు దుకాణానికి లాటరీ తీసి విజేతగా నెప్పలి శ్రీనివాసరావును ప్రకటించారు. అనంతరం రెండు కౌంటర్లలో జరిగిన లాటరీ మధ్యాహ్నం ఒంటిగంటకు ముగిసింది. అంతేకాకుండా ఒక్కో దుకాణానికి లాటరీలో విజేతలను ప్రకటించినప్పటికీ మరో ఇద్దరు రిజర్వు అభ్యర్థులను కూడా లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో శ్రీలత, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ, ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, జడ్పీ సీఈవో చిరంజీవి, ఏఎస్పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

15 మంది మహిళకు మద్యం దుకాణాలు

మహిళలకు 15 మందికి లాటరీ ద్వారా మద్యం దుకాణాలు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కె.ఖాజామొహిద్దీన్ తెలిపారు. వాటిలో ఒంగోలు సర్కిల్ పరిధిలో 4, చీమకుర్తిలో 1, సింగరాయకొండలో 3, పొదిలిలో 1, గిద్దలూరులో 2, దర్శిలో 2, కంభంలో 2 దుకాణాలు వచ్చాయని ఆయన తెలిపారు. అదేవిధంగా మద్యం దుకాణాలు లాటరీ ద్వారా పొందిన వారు 24 గంటలలో లైసైన్స్ ఫీజు ఆరవ వంతు చెల్లించి ప్రొవిజనల్ లైసెన్స్‌లు పొందాలని ఈఎస్ కోరారు.

అధికంగా కొండపి దరఖాస్తులు

జిల్లాలో మొత్తం 171 దుకాణాలకు సంబంధించి 3,466 దరఖాస్తులు రాగా వాటిలో ఎక్కువ కొండపిలో 58 నంబరు దుకాణానికి 46 వచ్చాయి. పొదిలి రూరల్ 71 నంబరు దుకాణం, హెచ్‌ఎంపాడు 72 దుకాణం, దర్శిలో 88 నంబరు దుకాణాలకు అత్యంత తక్కువగా 11 దరఖాస్తులు చొప్పున రావడం గమనార్హం. ఒక దరఖాస్తు వేసిన రిటైర్డ్ ఎక్సైజ్ అధికారికి అదృష్టం వరించి దుకాణం దక్కడం విశేషం. అదేవిధంగా 46 దరఖాస్తులు వేసిన ఓ వ్యాపారికి ఒక్క దుకాణం కూడా దక్కకపోవడంతో నిరాశగా వెనుదిరిగాడు. పొన్నలూరులో రెండు మద్యం దుకాణాలు ఉండగా అదృష్టం అన్నదమ్ములను వరించింది. పల్లపోతు ప్రసాద్, రమేష్‌లకు ఆ దుకాణాలు దక్కాయి.

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

మద్యం దుకాణాల లాటరీ సందర్భంగా భద్రత ఏర్పాట్లను ఎస్పీ ఏఆర్ .దామోదర్ స్వయంగా పరిశీలించారు. అంబేడ్కర్ భవనం వెలుపల, లోపల ఎలాంటి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కర్నూలు రోడులోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద కూడా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. అక్కడ లైసెన్స్ ఫీజు చెల్లించే వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా చూశారు. ఆయన వెంట ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఎస్పీ సీఐ రాఘవేంద్రరావులు ఉన్నారు.



లాటరీ తీసి దుకాణం దక్కిన వారిని ప్రకటిస్తున్న కలెక్టర్ అన్సారియా

లాటరీని అడ్డుకునే ప్రయత్నం చేసిన మహిళా సంఘాలు

మద్యం లాటరీ జరుగుతున్న అంబేడ్కర్ భవన్ వద్దకు మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొంతమంది మహిళలు వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు కంకణాల రమాదేవి, బి.పద్మలను అదుపులోకి తీసుకొని వన్‌టౌన్‌కు తరలించారు. మద్యనిషేధం అమలుచేయాలని, ప్రభుత్వ ప్రకటించిన పాలసీని వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

లాభాల పంట

- దక్షిణాదిలో ముగిసిన పొగాకు వేలం
- 153.58 మిలియన్ కిలోల అమ్మకం

ఒంగోలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది ప్రాంత పొగాకు రైతులను ఈ ఏడాది లాభాలు ముంచెత్తాయి. పొగాకు బోర్డు చరిత్రలో ఎన్నడూ లేనంత స్థాయిలో ధరలు లభించాయి. పంట ఉత్పత్తి అనుమతికి మించి సుమారు 75శాతం అధికంగా అయినప్పటికీ ధరలు గతం కన్నా భారీగా పెరిగాయి. మొత్తంగా దక్షిణాదిలో 11 పొగాకు వేలం కేంద్రాలలో ఈ ఏడాది (2023-24) సమారు 153.58 మిలియన్ కిలోల విక్రయాలు జరగ్గా సగటున కిలోకు రూ 266.41 ధర లభించి పొగాకు రైతులకు దాదాపు రూ.4,085.50 కోట్ల మేర రాబడి వచ్చింది. సగటు ధరల్లో గత రెండేళ్ల కన్నా భారీగా పెరుగుదల కనిపించింది. ఒంగోలు కేంద్రంగా ఉన్న పొగాకు బోర్డు దక్షిణాదిలోని రెండు రీజియన్ల పరిధిలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 11 వేలం కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో 2023-24 సంవత్సరానికి 57,767.39 హెక్టార్ల విస్తీర్ణంలో పంట సాగుకు, 88.96 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇచ్చింది. అయితే 29,885 మంది రైతులు 24,130 బ్యారన్లకు లైసెన్సులు పొంది 72,345.90 హెక్టార్లలో పంట సాగు చేశారు. అలా సుమారు 15వేల హెక్టార్లలో పంట అధికంగా సాగు కాగా ఉత్పత్తి కూడా భారీగా పెరిగింది.

తొలుత ఇబ్బందులు

తొలుత పంట సాగులో రైతులు బాగానే ఇబ్బందులు పడ్డారు. సకాలంలో వర్షాలు లేక పంట సాగుకు ఇక్కట్లు పడగా ఆ తర్వాత నవంబరు, డిసెంబరు మాసాలలో కురిసిన వర్షాలు మరింత దెబ్బతీశాయి. అయితే అంతకు ముందు ఏడాది వచ్చిన లాభాలు, ప్రస్తుత సీజన్‌పై ఆశతో తిరిగి నాట్లు వేశారు. కొన్ని ప్రాంతాల్లో ఒకవైపు ముదురు తోటల్లో ఆకు రెలుపు, మరోవైపు మొక్కలు నాటడం సాగింది. సంక్రాంతి తర్వాత ఎండల తీవ్రత కూడా ఇబ్బందిపెట్టింది. అలా అనేక ప్రతికూల పరిస్థితులతో పంటను రైతులు సాగు చేయగా 145 మిలియన్ కిలోల పంట ఉత్పత్తి అంచనాతో ఫిబ్రవరి 29న కొన్ని వేలంకేంద్రాలలో, మార్చి 6న మరికొన్నింటిలో పొగాకు కొనుగోళ్లను బోర్డు అధికారులు ప్రారంభించారు. తొలిరోజు గరిష్ఠ ధర కిలో రూ.230 పలుకగా దాదాపు నెల రోజులు అలాగే సాగాయి. పెరిగిన ఉత్పత్తి ఖర్చుల నేపథ్యంలో ఆ ధరలతో రైతులు నష్టపోతామన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమైంది. అనంతరం క్రమంగా పెరుగుతూ మేలు రకం గరిష్ఠ ధర ఒక దశలో రూ.389 వరకు వెళ్లింది. అంతేకాక మీడియం, లోగ్రేడ్ ధరలు సైతం భారీగా పెరిగాయి. సగం సమయం గ్రేడ్‌తో సంబంధం లేకుండా అన్ని గ్రేడ్‌లను ఇంచుమించు ఒకే ధరకు కొనుగోలు చేశారు. గతంలో ధరల కోసం రోడ్డెక్కి రైతులు ఆందోళనలు చేసే పరిస్థితి ఉండేది. అలాంటిది రెండు, మూడేళ్లుగా బేళ్ల కోసం వ్యాపారులు పోటీ పడి కొనుగోలు చేశారు. మొత్తంగా మార్కెట్ మంచి ఊపు మీద సాగడంతో సగటు ధరలు కూడా భారీగా లభించాయి.

కిలోకు సగటు ధర రూ.266

దక్షిణాదిలో ఫిబ్రవరి 29నుంచి ప్రారంభమైన కొనుగోళ్లు సెప్టెంబరు ఆఖరు నుంచి ఒక్కో కేంద్రంలో ముగుస్తూ వచ్చి చివరగా కందుకూరు-1 వేలం కేంద్రంలో సోమవారంతో పూర్తయ్యాయి. దీంతో ఈ సీజన్ పొగాకు కొనుగోళ్లు ముగిశాయి. తొలుత 145 మిలియన్ కిలోల ఉత్పత్తి అంచనా వేసినా చివరకు 153.58 మిలియన్ కిలోలు దక్షిణాదిలోని 11 వేలం కేంద్రాలలో కొనుగోళ్లు జరగ్గా సగటున కిలోకు రూ.266.14 ధర లభించింది. తద్వారా పొగాకు రైతులకు రూ.4085.50 కోట్ల మేర రాబడి లభించింది. దక్షిణాదిలో 2021-22లో 76.57 మిలియన్లు విక్రయాలు జరగ్గా రూ. 172.50 సగటు ధర లభించింది. అలాగే 2022-23లో 123 మిలియన్ల విక్రయాలు జరగ్గా సగటున కిలోకు రూ.216.28 ధర లభించింది. అంటే ఈ ఏడాది సగటు ధర కిలోకు గత ఏడాది కన్నా రూ 50 అలాగే అంతకు ముందు ఏడాదికన్నా రూ.94.09 మేర పెరిగింది.

వేలంకేంద్రాల వారీగా ఈ సీజన్‌లో పంట కొనుగోళ్లు, లభించిన ధరల వివరాలు ఇలా ఉన్నాయి.

వేలం కేంద్రం	కొనుగోలు జరిగిన పంట పరిమాణం (మిలియన్ కిలోలు)	లభించిన సగటు ధర (రూపాయల్లో)
వెల్లంపల్లి	15.06	275.77
ఒంగోలు-1	18.58	272.75
ఒంగోలు-2	13.80	265.05
టంగుటూరు	16.80	271.54
కొండపి	17.71	265.61
పొదిలి	14.73	263.60
కనిగిరి	7.95	252.60
కందుకూరు-1	16.14	273.00
కందుకూరు-2	14.21	263.28
కలిగిరి	7.68	253.84
డిసిపల్లి	10.39	250.36
మొత్తం	153.58	266.14

రఘురామకృష్ణరాజు కేసు

దర్యాప్తు అధికారిగా ఎస్పీ ఏఆర్.దామోదర్

ఒంగోలుక్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మాజీ ఎంపీ, ప్రస్తుతం ఉండి శాసనసభ్యులు రాఘురామకృష్ణరాజుపై కేసుకు సంబంధించి విచారణాధికారిగా ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్.దామోదర్‌ను నియమించారు. ఇప్పటివరకు గుంటూరు జిల్లా ఏఎస్పీగా పనిచేస్తున్న రమణమూర్తిని ఆ బాధ్యతల నుంచి తప్పించి ఎస్పీ దామోదర్‌కు అప్పగించారు. కేసుకు సంబంధించిన ఫైల్స్‌ను ఆయనకు అప్పగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఏఆర్.దామోదర్ ప్రొబెషనరీ డీఎస్పీగా ప్రకాశం జిల్లాలో పనిచేసిన సమయంలో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హైవే కిల్లర్ మున్నా గ్యాంగ్ ఆట కట్టించిన అధికారిగా మంచిగుర్తింపు తెచ్చుకున్నారు. ముక్కు సూటితనం, పోలీసు ప్రతిష్ఠను పెంచాలనే ఆశయంతో పనిచేసి అనేక ముఖ్యమైన కేసులు ఛేదించారు. దామోదర్‌కు ఈ కేసు అప్పగించడంతో దర్యాప్తు వేగవంతం అవుతుందనే ఆశాభావం వ్యక్తం అవుతోంది. అప్పట్లో సీఐడీలో ఏఎస్పీగా పనిచేస్తున్న విజయపాల్ తనను విచారణ కోసం పిలిచి హత్యాయత్నం చేశారని ఈ ఏడాది జూలై 11న గుంటూరు జిల్లా నగరపాలెం పోలీసు స్టేషన్‌లో రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేశారు. అందుకు బాధ్యులుగా అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోపాటు, నాటి సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్, నిఘా విభాగం అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు, మరికొందరిపై కూడా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నగరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు కేసు విచారణాధికారి రమణమూర్తి ఈనెల 11న ప్రసుత్తం రిటైర్డ్ ఏఎస్పీ విజయపాల్‌ను విచారణకు పిలిచారు. అయితే విజయపాల్ విచారణకు సహకరించలేదని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. దీంతో ఎస్పీ స్థాయిలో ఉన్న దామోదర్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన సంబంధిత కేసు ఫైల్స్‌ను పరిశీలించిన తర్వాత విచారణ ప్రారంభించే అవకాశం ఉంది.

ఉత్సాహంగా పల్లె పండుగ

- జోరువానలోనూ కార్యక్రమం
- పెట్లూరులో పాల్గొన్న మంత్రి డాక్టర్ స్వామి
- ఇతర చోట్ల ఎమ్మెల్యేలు హాజరు
- రోడ్లు, ఇతర పనులకు శంకుస్థాపనలు

ఒంగోలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రారంభమైంది. ఈనెల 20 వరకు జరగనున్న ఈ కార్యక్రమంలో జిల్లాలో సుమారు రూ.126.19 కోట్ల ఉపాధి పథకం మెటీరియల్ కోటా నిధులతో చేపట్టే 1,168 పనులకు శంకుస్థాపనలు, భూమిపూజ కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు చేయనున్నారు రాష్ట్రవ్యాప్తంగా అలా సుమారు రూ.4,500 కోట్లతో 30వేల పనులు చేపట్టేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. కాగా జిల్లాలో సగటున ఒక్కో నియోజకవర్గానికి రూ.15 కోట్ల వంతున కేటాయింపు జరిగింది. ప్రధానంగా గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు, గ్రావెల్ రోడ్ల పనులు కూడా ఉన్నాయి. గత ఆగస్టు 23న ఒకేరోజు 729 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించిన సందర్భంగా ఆయా పనుల నిర్వహణకు తీర్మానాలు చేయడం అనంతరం వాటికి పాలనాపరమైన ఉత్తర్వులు కలెక్టర్ ఇచ్చారు. కాగా ఆయా పనులకు ఈ వారంరోజుల్లో శంకుస్థాపనలు చేసి జనవరి ఆఖరుకు పనులు పూర్తిచేయాలన్న లక్ష్యంతో పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది.

57 గ్రామాల్లో 170 పనులకు భూమిపూజ

తొలిరోజైన సోమవారం జిల్లా అంతటా ఈ కార్యక్రమం సాగింది. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి తన నియోజకవర్గ పరిధిలోని కొండపి మండలం పెట్లూరులో రూ.30 లక్షలతో చేపట్టిన రోడ్డు పనికి ఈ శంకుస్థాపన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. జిల్లాలోని ఇతర నియోజకవర్గాలలో అక్కడి అధికారపార్టీ ఎమ్మెల్యేలు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నా పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని అటు అధికార యంత్రాంగం, ఇటు స్థానిక అధికార పార్టీ నేతలు సమన్వయంతో నిర్వహించారు. తొలిరోజున 57 గ్రామాల్లో 170 పనులకు భూమిపూజ కార్యక్రమాలను అధికారులు ఏర్పాటు చేయగా వర్షం కారణంగా కొన్నిచోట్ల ఆటంకం ఏర్పడినా అత్యధిక పనులను అనుకున్న ప్రకారం చేశారు. కాగా తొలిరోజున మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మినహా అందరూ కార్యక్రమంలో పాల్గొన్నారు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో పాలొన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్‌విజయకుమార్ మద్దిపాడు మండలంలో, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కనిగిరి మండలంలో, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి గిద్దలూరు మండలంలో, టీడీపీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కురిచేడు మండలంలో, వైపాలెంఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు దోర్నాల మండలంలోని గ్రామాల్లో ఈ కార్యక్రమంలో పాల్గొని వివిధ పనులకు శంకుస్థాపనలు చేశారు.

జిల్లాకు వానగండం పొంచి ఉంది. ఇప్పటికే నాలుగైదు రోజులుగా ముసురుపట్టి వానలు పడుతుండగా ఆదివారం రాత్రి నుంచి తీవ్రత మరింత పెరిగింది. ప్రస్తుతానికి ఇప్పటివరకు కురిసిన వర్షాలే సరిపోయే అవకాశం ఉండగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి వాన జోరు అధికమైంది. ఒంగోలు నగరంలో అయితే తెరపి లేకుండా పడుతూనే ఉంది. జిల్లావ్యాప్తంగా అత్యధిక ప్రాంతంలో సోమవారం పగలంతా ఇదే పరిస్థితి కనిపించింది. మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆ మేరకు రాష్ట్ర ప్రకృతి విపత్తుల విభాగం హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది.

వానగండం

- నేడు, రేపు భారీ వర్షాలు
- నాలుగు రోజుల్లో 56మి.మీ వర్షపాతం
- ఒంగోలులో గరిష్ఠంగా 181.40 మి.మీ
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- తీరప్రాంత గ్రామాల్లో పర్యటన
- రెండు రోజులు స్కూళ్లకు సెలవు
- ప్రకటించిన కలెక్టర్ అన్సారియా

ఒంగోలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మళ్లీ వానలు ప్రారంభమయ్యాయి. అలా సోమవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో జిల్లాలో సగటున 20.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. పలుచోట్ల ఒక మోస్తరు నుంచి భారీ వర్షమే కురిసింది. అలా ఈనెల 11నుంచి సోమవారం ఉదయం వరకు సగటున జిల్లాలో 56.0 మి.మీ వర్షపాతం నమోదైంది. ఒంగోలులో అత్యధికంగా ఏకంగా 181.40 మి.మీ నమోదైంది. అలాగే సంతనూతలపాడు, కొండపి, కనిగిరి, మార్కాపురం, దర్శి నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో 100 మి.మీపైగా ఈ నాలుగు రోజుల్లో నమోదు కాగా ఇతర ప్రాంతాల్లోనూ మంచి వర్షాలే కురిశాయి. సాధారణంగా జిల్లాలో ఈ సమయంలో మంచి వర్షాలే కురుస్తాయి. అలాగే ఈనెల 10 నుంచి జిల్లా అంతటా జల్లులు పడుతున్నాయి. ఒక రకంగా ముసురు పట్టి వాన పడుతోంది. అలా ఈనెల 11 నుంచి 13 వరకు జిల్లాలో 36.0 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. తిరిగి ఆదివారం రాత్రి నుంచి వానలు జోరు పెరిగింది. ఆదివారం ఉదయం వరకు మూడురోజుల్లో నగరంలో 106.40 మి.మీ వర్షపాతం నమోదు కాగా సోమవారం మరో 74.40 మి.మీ.కురిసింది. తిరిగి సోమవారం పగటి పూట కూడా పడుతూనే ఉంది.

నగరం జలమయం

ఒంగోలు నగరంలో ఏ ప్రాంతంలో చూసినా రోడ్లు, కాలువలు ఏకమై చెరువులు, వాగులు, వంకలను తలపిస్తూ నీరు ప్రవహిస్తోంది. శివారు కాలనీల్లోనే కాక పలు ప్రధాన ప్రాంతాల్లోనూ కూడా జలమయమయ్యాయి. ఉద్యోగులు, వ్యాపారులు, సాధారణ ప్రజలు, చిరు వ్యాపారులు ఇలా అందరూ ఇక్కట్లు పడుతున్నారు. ఒంగోలుతోపాటు ఎస్ఎన్‌పాడు, కొండపి నియోజకవర్గాల్లోని తీర ప్రాంత మండలాల్లో ఇలాంటి పరిస్థితే ఏర్పడింది. చాలాచోట్ల లోతట్టు కాలనీలు జలమయంతోపాటు పలు ప్రాంతాల్లో వాగులు పొంగి రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. పశ్చిమప్రాంతంలో అయితే పొలాల్లో విస్తారంగా పంటలు ఉండగా ఈ వర్షాలతో అవి దెబ్బతినే ప్రమాదం కనిపిస్తోంది. పత్తి, మిర్చి, కంది పంటలకు ఇంకా వర్షం కురిస్తే నష్టం వాటిల్లుతుందని రైతాంగం ఆందోళన చెందుతున్నారు.

పల్లెలకు అభివృద్ధి కళ



ఏల్చూరులో శంకుస్థాపన అనంతరం మాట్లాడుతున్న మంత్రి

- మంత్రి గొట్టిపాటి
- పలుచోట్ల సీసీ రోడ్లు, డ్రైన్లు, గోకులాలకు శంకుస్థాపనలు

సంతమాగులూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో అంతర్గత మట్టిరోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో మంత్రి రవికుమార్ పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో రూ.60లక్షల వ్యయంతో నూతనంగా సీసీరోడ్ల నిర్మణానికి శంకుస్తాపన చేశారు. రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పల్లెలను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. పల్లెల్లో చేపట్టనున్న అభివృద్ధిపై ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రాధాన్యతాక్రమంలో పనులన్నీ చేపడతామన్నారు. కార్యక్రమంలో పీడీ విజయలక్ష్మీ, ఆర్‌డీవో అఖిల, ఎంపీడీవో జ్యోతిర్మయి, తహసీల్దార్ రవిబాబు, డీపీవో, ఎంఈవో కోటేశ్వరరావు, గాలియ్య, రమేష్, పెదగాలియ్య శ్రీనివాసరావు, వాసిరెడ్డి, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బల్లికురవ : ఉపాధి హామీ నిధులతో గ్రామాలలోని మట్టి రోడ్లకు మహర్దశ పట్టనుందని ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. మండలంలోని వేమవరం, ఉప్పుమాగులూరు, కొప్పెరపాలెం గ్రామాలలో సోమవారం పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను నిర్వహించారు. మూడు గ్రామాలలో సీసీ రోడ్లకు ఎంపీడీవో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ మాధవ్, సర్పంచ్‌లు వెంకటసుబ్బారావు, శాంతి, ఏపీవో రమాదేవి, ఈవోపీఆర్డీ సుమతి, గ్రామ పెద్దలు నరేంద్ర, వినోద్, శ్రీనివాసరావు, మారుతి పాల్గొన్నారు.

పంగులూరు : ఉపాధి నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, గోకులం షెడ్లను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని ఎంపీడీవో కే స్వరూపారా ణి సూచించారు. చందలూరు, నూజెళ్లపల్లి, తూర్పుకొప్పెరపాడు, తక్కెళ్లపాడు గ్రామాలలో సోమవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీసీ రోడ్లు, గోకులాల నిర్మాణానికి ఎంపీడీవో భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు, ఏఈ హనుమంతరావు, జి.వీరాంజనేయులు, ఈవోపీఆర్డీ కె.సుమంత్, ఏపీవో సంతోషం, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కేవీ సుబ్బారావు, సర్పంచ్‌లు పెంట్యాల కిషోరా వు, కళ్యాణి, రవిబాబు, రామలింగస్వామి, నేతలు పాల్గొన్నారు.

చినగంజాం : సంతరావూరులో పల్లెపండుగలో భాగంగా సీసీ రోడ్లకు, మినీ గోకులాలకు భూమి పూజ నిర్వహించారు. ఎస్సీ కాలనీలో రూ.15లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు, గ్రామంలో మంజూరైన తొమ్మిది మినీ గోకులాలకు అధికారులు, నాయకులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాసమూర్తి, టీడీపీ సీనియర్ నాయకురాలు యార్లగడ్డ లక్ష్మీ, ఈవోపీఆర్డీ బి.సుబ్బారావు, ఏపీవో జె.లక్ష్మీదేవి, పంచాయతీరాజ్ ఏఈ కే.రామచంద్రుడు, కార్యదర్శి కే.కృపారావు, నాయకులు కేశనపల్లి శ్యాంబాబు పాల్గొన్నారు.

ఇంకొల్లు : పూసపాడు, వంకాయలపాడు గ్రామాలలో రోడ్ల అభివృద్ధికి భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. పూసపాడులో రూ.50లక్షలతో సీసీ రోడ్లు, ఇడుపులపాడులో రూ.30లక్షలతో సీసీ రోడ్లు, వంకాయలపాడులో రూ.25లక్షలతో సీసీ రోడ్లు వేసేందుకు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీవో రేణుకా, పీఆర్ జేఈ ఆనంద్, పంచాయతీ కార్యదర్శులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



అన్నంబొట్లంవారిపాలెంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

పర్చూరు : గ్రామాల్లో రహదారులను అభివృద్ధి చేసి ప్రజల ఇక్కట్లను తీర్చేందుకు ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన పల్లె పండుగ కార్యక్రమం సోమవారం అధికారులు, పార్టీ నేతల సారధ్యంలో అట్టహాసంగా ప్రారంభించారు. దేవరపల్లి, తిమ్మరాజుపా లెం, చిన్నంబొట్లవారిపాలెం, అన్నంబొట్లవారిపాలెంలో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించి సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్, ఈవోఆర్డీ సత్యనారాయణ, డిప్యూటీ ఈఈ పీఆర్ కె.ఆదినారాయణ, ఏఈ శ్రీనివాసరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, టీడీపీ నాయకులు శేఖర్‌బాబు, షంషుద్దీన్, పంచాయతీ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : గ్రామీణ ప్రాంతాలల్లో సదుపాయాల కల్పనలో భాగంగా సైడ్ కాలువలు, సీసీ రోడ్లు నిర్మించుకుందామని ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి మస్తాన్‌రావు అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా తిమ్మనపాలెం, ఎర్రబాలెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తిమ్మనపాలెం సర్పంచ్ లక్ష్మి శ్రీనివాసరావు, యర్రబాలెం సర్పంచ్ మోరవినేని బాలాజీ, పంచాయతీ రాజ్ ఏఈ ప్రసాద్, టీడీపీ నాయకులు వెంకటరావు, సాధినేని మస్తాన్‌రావు, రాంబాబు, కోటపూరి లక్ష్మణరావు పాల్గొన్నారు. మంగళవారం పమిడిపాడులో జరిగే పలె పండుగ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి పాల్గొంటారని ఎంపీడీ రాజ్యలక్ష్మి తెలిపారు.

నిలిచిన వేట.. ఒడ్డుకు బోట్లు



సంద్రంలో లంగరు వేసిన పడవలు (ఇన్‌సెట్‌లో) ఒడ్డున ఉన్న బోట్లు

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో వేటను నిలిపివేశారు. కొందరు బోట్లను ఒడ్డుకు చేర్చారు. మరికొందరు తీరం వెంట సముద్రంలో లంగర్లు వేశారు. తిరిగి వాతావరణ పరిస్థితులు చక్కబడిన తరువాతే వేటకు వెళతామని మత్స్యకారులు చెప్తున్నారు.

- చీరాల

వైభవంగా జ్వాలాముఖి తెప్పోత్సవం



తెప్పోత్సవంలో కొలువైన అమ్మవారు

చీరాలటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రులు ముగింపు సందర్భంగా చీరాల దండుబాటలోని శ్రీ జ్వాలాముఖి అమ్మవారి తెప్పోత్సవాలు వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా కొలనులో కనుల పండువగా దేదీప్యమానంగా హంస వాహనంపై అమ్మవారిని అలంకరించి వేడుకలు నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ వేడుకలకు భక్తులు విశేషంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆద్యంతం అమ్మ నామాన్ని జపిస్తూ భక్తి శ్రద్ధలతో భక్తులు పరవసించారు.

డ్రైనేజీ సమస్య లేకుండా చూడండి

మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే కొండయ్య సూచన



మరమ్మతులను పరిశీలిస్తున్న కమిషనర్

చీరాలటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు తీవ్రత వలన ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్‌తో ఎమ్మెల్యే కొండయ్య ఫోన్‌లో మాట్లాడారు. పురపాలక సంఘం పరిధిలో డ్రైన్‌లను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. దీంతో కమిషనర్ తన సి బ్బందితో పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. డ్రైన్‌లు సమస్యలు ఉన్నచోట్ల పూడికలు, మరమ్మతులు చేయించారు. దీనిపై ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఏడుగురిపై కేసులు

- రూ.1.75లక్షల అపరాధ రుసుము విధింపు
- వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల దుర్వినియోగంపై స్పందించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అద్దంకి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లను దుర్వినియోగం చేస్తూ చేపల చెరువులకు నీటి పంపింగ్‌కు వినియోగిస్తున్న ఏడుగురిపై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు చేసి వారికి రూ.లక్షా75వేల అపరాధ రుసుము విధించినట్లు విద్యుత్ రూరల్ ఏఈ శివ ప్రసాద్ తెలిపారు. ఆం ధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల దుర్వినియోగం అనే కథనంపై స్పందిచిన ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తనఖీలకు ఆదేశించడంతో రూరల్ ఏఈ శివప్రసాద్ సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీలు చేపట్టారు. తరచూ తనిఖీలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

గోతుల మయం

- పంగులూరు, ముప్పవరం ప్రధాన రహదారిలో నరక ప్రయాణం



పంగులూరు-ముప్పవరం ప్రధాన రహదారిలో గోతులు

పంగులూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంగులూరు, ముప్పవరం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై పలు చోట్ల ఏర్పడిన గోతులతో రాకపోకలకు అంతరాయంగా ఉంది. నిత్యం వాహన రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారిలో రాక పోకలు సాగించలేక వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇంకొల్లుతో పాటు పంగులూరు పరిసర ప్రాంతాల ప్రజలు వివిద పనుల నిమిత్తం 16వ నెంబరు జాతీయ రహదారిని చేరుకునేందుకు ఈ ప్రధాన రహదారిపై ప్రయాణం సాగిస్తుంటారు. అద్దంకి నుంచి ఇంకొల్లుకు ప్రజా రవాణా కోసం నడిపే ఆర్టీసీ బస్సులతో పాటు ఇటుక, ఇతర రవాణా సరుకులు చేరవేసే ట్రాక్టర్లు, లారీలు, ఇతర వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా జనకవరం, ముప్పవరం గ్రామాల మధ్య భారీ గోతులు దర్శన మిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా ఈ ప్రధాన రహదారిలో ఏర్పడిన గోతులకు అధికారులు కనీస మరమ్మతులు కూడా చేపట్టలేదు. రాత్రివేళ ప్రయాణించే ద్విచక్ర వాహన చోదకులు భారీ వాహానాలు ఎదురైన సందర్భంలో లైట్ల వెలుగులో గోతులను గుర్తించ లేక తరచూ ప్రమాదలబారిన పడుతున్నారు. సుమారు నాలుగు కిలోమీటర్ల నిడివిలో జనకవరం, కొండమూరు అడ్డరోడ్డు నుంచి ముప్పవరం వరకు రోడ్డుపై అడుగడుగునా ఏర్పడిన గుంతలపై ప్రయాణం ఇబ్బందిగా ఉందని వాహన చోదకులు వాపోతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు పునర్ నిర్మించే వరకు కనీస మరమ్మతులనైనా చేపట్టాలని సంబంధిత అధికారులను వాహన చోదకులు, ఈ ప్రాంత ప్రజలు వేడుకుంటున్నారు.



కొండమూరు, ముప్పవరం మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు

వాన అవస్థలు

- రోడ్లు జలమయం
- పొంగిపొర్లుతున్న వాగులు
- మత్స్యకారుల వేటకు వెళ్లొద్దని హెచ్చరిక



చీరాలలో ప్రధాన రోడ్లపై నిలిచిన వర్షపు నీరు

చీరాలటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కుండపోతగా కురిసిన వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన రహదారులు, కుంటలు నీటితో నిండి వాగులను తలపించాయి. గాలివానకు వాహనదారులకు రోడ్లు సైతం మూసుకుపోయి ప్రయాణం నరకంగా మారింది. మరో మూడు రోజులు వానలు కురిసే అవకాశం ఉండడంతో అధికారులు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

నిండిన పొలాలు

బల్లికురవ : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు సోమవారం ఎడ తెరపి లేకుండా కురవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. అన్ని గ్రామాలలో వాన ఆగకుండా పడుతుండడంతో సాగు చేసిన రైతుల్లో ఆందోళన నెలకుంది. మరో మూడు రోజులు వర్షాలు పడతాయని అధికారులు చేసిన ప్రకటనతో పొగాకు రైతులు తమ పంటకు ముప్పు తప్పదని అంటున్నారు. జూట్ పంట కాపు మీద ఉందని, ఇప్పుడు వర్షాలు పడితే పంట చేతికి వచ్చే అవకాశం ఉండదని వారు అంటున్నారు. భారీ వర్షాల ప్రభావంతో గ్రామాలలోని రోడ్లు జలమయమయ్యాయి. బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో రోడ్లు వాగలను తలపిస్తున్నాయి. చెన్నుపల్లి అనంతవరం రోడ్డు లో క్వారీల వద్ద రోడ్డు బురదగా మారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గ్రానైట్ నేల క్వారీలలో పనులు నిలిచిపోయాయి

చినగంజాంలో భారీ వర్షం

చినగంజాం : చినగం జాం మండలంలో భారీ వర్షం కురిస్తుంది. సోమవారం వేకువ జాము నుం చి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుంది. భారీ వర్షం కారణంగా మండల పరిధిలో పలు చోట్ల పోసిన వరి నారుమడులలో వర్షపునీరు నిలిచింది. వేసిన వరినాట్లు కూడా వర్షపునీటిలోనే ఉన్నాయి. వర్షం ఇలాగా కొనసాగితే వరినారుముడులు, వేసిన నాట్లు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెదగంజాం గ్రామంలో పిట్టు నాగార్జునరెడ్డికి చెందిన మట్టిగోడల పూరిల్లు చుట్టూ వర్షపునీరు చేరడంతో మట్టిగోడలు నాని కూలిపోయాయి. గ్రామాల్లో అంతర్గత రోడ్లుపై వర్షపునీరు చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చిన గంజాం గ్రామ శివారు కాలనీలకు వెళ్లే రోడ్లు బురదమయంగా మారడంతో కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు నరకయాతన పడుతున్నారు. కడవకుదురు వద్ద చీరాల, ఒంగోలు ఆర్‌అండ్‌బీ రహదారిపై వర్షపునీరు చేరి చెరువును తలపించాయి. దీనితో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రాకపోకలకు పలు ఇబ్బందులు పడ్డారు. వర్షాల వలన ఆక్వా చెరువులలో కూలింగ్ సమస్య తలెత్తే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు తెలిపారు.

పొంగిన వంకాయలపాడు వాగు

ఇంకొల్లు : వర్షాలకు పాతమద్రాసు రోడ్డులో ఇంకొల్లు నుండి పర్చూరు పోవు రహదారిలో వంకాయలపాడు వద్ద కప్పలవాగు పొంగి ప్రవహిస్తుంది.ఇక్కడ వాగుపై ఉన్న బ్రిడ్జి శిధిలావస్థకు చేరుకోవడంతో నేలచప్టా నిర్మాణం చేసారు.చిన్నపాటి వర్షానికే నేల చప్టా పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి.ఎగువన వర్షాలు కురిసినా రాకపోకలు ఆగిపోతున్నాయి.ఎటు వాహనాలు అటు నిలిచిపోతున్నాయి.ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు.

పర్చూరు : వర్షాలతో జన జీవనం స్తంభించింది. ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. రహదారులు జలమయం కావడంతో అనేక చోట్ల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. వాగులు, కాలువల్లోకి భారీగా నీరుచేరింది. భారీ వర్షాల కారణంగా అధికారులు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు సెలువు ప్రకటించారు. పర్చూరు - చీరాల ప్రధాన రహదారిలో పెద్ద ఎత్తున నీరు రోడ్డుపై చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

వేకువ జామునుండి ఎడతెరపు లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో శివారు కాలనీల్లో వరద నీరు చేరింది. ఇందిరా కాలనీ, నెహ్రూనగర్, అంబేద్కర్ కాలనీ, బోడవాడ శివారు కాలనీలతో పాటు పలు ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాల్లోని నివాసాల్లోకి వాన నీరు చేరింది.



నక్కబొక్కలపాడులో పొగాకు పంటలో నిలిచిన వర్షపు నీరు



ప్రవహిస్తున్న వంకాయలపాడు వాగు

లక్కు వీరులు



డ్రాలో దక్కిన మద్యం దుకాణాలు

అద్దంకి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి నియోజకవర్గంలో లక్కు వీరులు తమ అదృష్టంలో నెగ్గారు. 23 మద్యం షాపులకు దక్కించుకున్న వ్యక్తుల వివరాలను ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అద్దంకి సర్కిల్ సీఐ భవాని ప్రకటించారు. అద్దంకి పట్టణంలోని 19వ నెంబరు షాపును బొడ్డపాటి రవిబాబు, పరిటాల ఆదినారాయణకు 20వ షాప్, నాగేంద్రబాబుకు 21, 22 వ డి.హరికృష్ణకు 22, కోనేటి శేఖర్‌బాబు 23వ నెంబర్ దుకాణం దక్కింది. అద్దంకి రూరల్ మండలంలో 85వ నెంబర్ షాపును జి.హరిబాబుకు, 86ను కొటికలపూడి సర్పంచ్ పూనాటి విక్రమ్, బల్లికురవ మండలంలో 87 ప్రత్తిపాటి నరేంద్రకు, 88 మొరసా సురేష్‌కు, 89, 90 కట్టా వెంకటసుధాకర్, కొరిశపాడు మండలంలోని 91, 93 దుకాణాలను బి.సుబ్బారావు, 92 రవి, 94ను టీ అంజయ్య దక్కించుకున్నారు. సంతమాగులూరు మండలంలో 95వ నెంబర్ దుకాణం కొప్పాక తులసికి, 96 చేవూరి వాసురెడ్డి, 97 దాకా హనుమారెడ్డి, 98 జి.ఖాధర్‌బాబు, 99 శ్రీనివాస్ పొందారు. పంగులూరు మండలంలో 100వ నెంబరు షాపును బాచిన భానుప్రకాష్, 101 కానుమూరి ఆంజనేయులు, 102 గరిమిడి జగన్మోహనరావు దక్కించుకున్నారు. ఆయా మండలాలలో షాపులు దక్కించుకున్న వారిలో అత్యధిక శాతం స్థానిక టీడీపీ నేతలే కావడం విశేషం. దరఖాస్తులు దాఖలు సమయంలోనే అత్యధిక శాతం టీడీపీ నేతలు వేయడం తో వారిలో కొందరికి వైన్ షాపులు దక్కాయి. అయితే దరఖాస్తు చేసిన వారు ఎక్కువ శాతం సిండికేట్‌గా ఏర్పడ్డంతో వాటాల మేర షాపులను నిర్వహించే అవకాశం కన్పిస్తుంది. అయితే కొందరు నిరుద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా తమ లక్కును పరీక్షించుకునేందుకు వెళ్లి దక్కకపోవడంతో నిరుత్సాహంలో ఉన్నారు.

ముగిసిన మద్యం షాపుల లాటరీ

నేడు సరుకుకు డీడీల చెల్లింపు

చీరాలటౌన్ : ఎట్టకేలకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మద్యం పాలసీకి సంబంధించి చీరాల సర్కిల్ పరిధిలోని 24 షాపులకుగాను సోమవారం లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఈక్రమంలో చీరాల పురపాలక పరిధిలోని 8వ నెంబర్ దుకాణం ఎగుటూరి శివకుమారికి, నర్రా బాలకృష్ణకు 9, బెల్లం నాగార్జునకు 10, పృధ్వీ పవన్‌కుమార్ 11, సూరగాని నరసింహారావు 12, కీర్తి వెంకటరావుకు 13, యార్లగడ్డ కౌషిక్‌కు 14, దంతం వెంకటేశ్వర్లుకు 15, రూరల్ పరిధిలో 69వ నెంబర్ షాప్‌ను దొడ్డ శ్రీనివాసరావుకు, కర్పూరపు రామారావుకు 70, సూరగాని కుమార్‌రాజకు 71, ఎస్ చిరంజీవికి 72, నాగేంద్రుడు 73, ఉప్పలమర్తి వెంకట సుబ్బారావు 74, వేటపాలెం పరిధిలో 80వ షాప్, సూరగాని నరసింహారావు, 81 రామకిరణ్, 82ను జెట్టి చంద్రశేఖర్‌కు, రావిపాటి హనుప్రసాద్‌కు 83, నర్రా బాలకృష్ణకు 84, చిన గంజాం పరిధిలో 75వ షాప్‌ను నాయుడు హనుమంతురావుకు, 76ను రాములుకు, 77ని బత్తుల శ్రీనివాసరావుకు కేటాయించారు. కారంచేడు పరిధిలో 78వ దుకాణం నల్లూరి రవికి, యార్లగడ్డ వెంకటప్పయ్య 78 దక్కాయి. షాపులు సాధించిన వారు సరుకు కోసం మంగళవారం డీడీ చెల్లించనున్నారు. పాత దుకాణాలు నేటి రాత్రికి అధికారికగా మూతపడ్డాయి. మిగిలిన సరుకును అధికారులు స్వాదీనం చేసుకుంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కేటాయించిన దుకాణదారులు బుధవారం ఉదయం నుంచి విక్రయాలు జరుపనున్నారు. ఒకవైపు నూతన దుకాణాలు, మరోవైపు పాత బ్రాండ్‌లు మార్కెట్‌లోకి రానుండడంతో మద్యం ప్రియుల్లో సందడి నెలకుంది.

ఇంకొల్లు మండలంలో మూడు మద్యం దుకాణాలు మంజూరు కాగా లాటరీలో గెలుచుకున్న వారి వివరాలను ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు.షాపు నెంబరు 113 బోడాల మురళీకృష్ణ, 114 కొల్లా శ్రీనివాసరావు, 115వ దుకాణం పాలేరు రామకృష్ణకు దక్కినట్లు చెప్పారు.

పర్చూరు : పర్చూరు ప్రాంతంలో అత్యధికంగా మద్యం దుకాణాల కోసం ఆశావాహులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనగా వారి ఆశలు ఆవిరయ్యాయి. ఒకటి రెండు దరఖాస్తులు చేసుకున్న వారికి వైన్ షాపులు దక్కాయి. గతంలో పదుల సంఖ్యలో షాపులు నిర్వహించిన వారికి లాటరీలో చుక్కెదురైంది. పర్చూరు ఎక్సైజ్ సబ్‌డివిజన్ పరిధిలో మొత్తం 15 షాపులకుగాను 449 మంది పోటీపడ్డారు. మండల పరిధిలో మొత్తం 4 దుకాణాలకు 78, ఇంకొల్లు 3 షాపులకు 140, మార్టూరులో 6 షాపులకు 190, యద్దనపూడిలో 2 షాపులకు 41 మంది దరఖాస్తు చేసుకున్నారు.

పర్చూరు మండల పరిధిలో ఉన్న నాలుగు షాపులకు 103వ నెంబర్‌ను రంగినేని నాగరాజు, 104ను లింగిశెట్టి రామాంజనేయులు, 105ను శివనాగరాజు, 106ను సతీష్ దక్కించుకున్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

వేగం షార్ట్ ఫీల్మ్ సీడీ ఆవిష్కరణలో మంత్రి గొట్టిపాటి

బల్లికురవ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : యువత అన్ని రంగాల్లో రాణించి సమాజాభివృద్ధికి పాటుపడాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని కొప్పెరపాడుకు చెందిన దమ్ము ఏడుకొండలు నిర్మాతగా రుపొందించిన వేగం షార్ట్ ఫీల్మ్ సీడీని మంత్రి రవికుమార్ మంత్రి అతిధి గృహంలో సోమవారం అవిష్కరించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామిణ ప్రాంతాల యువకులు ప్రజలకు విజ్ఞానాన్ని పెంచేలా షార్ట్ ఫీల్మ్‌ను తీయడం అభినందనీయం అన్నారు. ప్రజల నుంచి మంచి ఆదరణ లభించి షార్ట్ ఫిల్మ్ విజయవంతం కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో దర్శకుడు వెంకట్, నిర్మాత దమ్ము ఏడుకోండలు, గ్రామస్థులు గుర్రాల శ్రీనివాసరావు, దమ్ము అంజనేయులు, అంజయ్య మనికె రామారావు, నాగరాజు, శివ పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్ధనలో పాల్గొన్న మంత్రి

సంతమాగులూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏల్చూరు గ్రామంలో గార్మియ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. విద్యుత్ గొట్టిపాటి రవికుమార్ పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. ఏల్చూరు గ్రామంలోని దర్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మంత్రి వెంట తేలప్రోలు రమేష్, అలూరి శ్రీనివాసరావు, నక్కా పెద గాలియ్య, దుద్దే గాలియ్య పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో యువకుడు మృతి

ఈపూరుపాలెం (చీరాలటౌన్) అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైలు ప్రమాదంలో కాటూరి భాను (28) సోమవారం ఉదయం మృతి చెందాడు. అతడు చీరాల మండలం ఈపూరుపాలెం పంచాయతీ ఈసూబ్‌నగర్ వాసి. ఆటో డ్రైవర్‌గా ఉంటూ భార్య కవిత, ఇద్దరు కుమారులను పోషిస్తున్నాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన భాను అదే ప్రాంతంలోని రైలు గేటు సమీపంలో పట్టాలపై మృతిచెంది పడివున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏరియా హాస్పిటల్‌కు స్ట్రెచ్చర్ బహూకరణ



స్ట్రెచ్చర్‌ను బహూకరించిన దాత

చీరాలటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఏరియా హాస్పిటల్‌కు ఈపూరుపాలెంకు చెందిన మునగాల షైమిత, నారాయణ దంపతులు స్ట్రెచ్చర్‌ను బహూకరించారు. రూ.10వేలు విలువైన వస్తువును హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.సుభాషిణికి అందజేశారు. రోగుల సౌకర్యార్థం ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయం చేయాలి

పోలీసులను ఆశ్రయించిన మహిళ, సంఘ నాయకులు

చీరాలటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : తన భర్తను వేధించి అతని మృతికి కారణమైన మహిళపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వేటపాలెంకు చెందిన గిరిజన మహిళ గంటా వాణి, సంఘ నాయకులు సుబ్బారావు డిమాండ్ చేశారు. ఇటీవల గంటా శేఖర్ బలవన్మరణం చెందిన సంఘటన పాఠకులకు విదితమే. ఈక్రమంలో అతని మృతి వెనుక మరో మహిళ ప్రమేయం ఉందని ఆరోపించారు. దీనిపై న్యాయపరమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సోమవారం ఎస్పీ తుషార్‌డూడీని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై విచారణకు ఎస్పీ డీఎస్పీ జగదీష్ నాయక్‌ను ఆదేశించారు. ఈ ఘటనపై వేటపాలెం పోలీసులు కేసు నమోదు చేసి ఇప్పటికే దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత ఎంఈవో మృతి



సత్యనారాయణ (ఫైల్

అద్దంకి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఎంఈవో యలగాల సత్యనారాయణ(70) ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత అద్దంకిలోని రామ్‌నగర్‌లో మృతి చెందారు. సత్యనారాయణ అద్దంకి, తాళ్లూరు, బల్లికురవ మండల విద్యాశాఖ అధికారిగా పనిచేశారు. అతనికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సత్యనారాయణ మృతదేహానికి పలువురు నివాళులర్పించారు.

ఈ-పంట ముసాయిదాల ఏర్పాటు

పంగులూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఈ-పంట నమోదు వివరాల ముసాయిదా రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచడం జరిగిందని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి తెలిపారు. పంగులూరు రైతు సేవా కేంద్రంలో ఈ పంట ముసాయిదాను ఏవో సుబ్బారెడ్డి రైతలుతో కలసి పరిశీలించారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులు ఈ నెల 16లోగా సరి చూసుకుని ఏవైనా తప్పులుంటే సంబంధిత రైతు సేవా కేంద్రం సిబ్బందికి తెలియపరచాలన్నారు. 18వ తేదీన తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. 18 నుంచి 22 వరకు డిజిటల్ ఎకనామిట్లు, ఫిజికల్ ఎకనామిట్లు రైతులకు ఇస్తామని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వర్షం కొనసాగితే మినుముకు నష్టం

అల్ప పీడనం కారణంగా కురుస్తున్న వర్షాలు ఎక్కువైతే కాపు దశలో ఉన్న మినుము పైరుకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని కొండమూరు, ముప్పవరం, రేణంగివరం, బయటమంజులూరు పరిసర గ్రామాలలో మినుమును విసారంగా సాగు చేశారన్నారు. మండలంలో 3వేల 500 ఎకరాల్లో మినుము పైరు సాగవుతున్నట్లు తెలిపారు. రెండు వేల ఎకరాల వరకు కాపు దశలో ఉన్నట్లు తెలిపారు.